రైల్వేలైన్ భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలి



రైల్వేలైన్ భూసేకరణపై రెవెన్యూ, రైల్వే అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

- భట్నవిల్లి నుంచి గుడిమెళ్లంక వరకు భూముల జాయింట్ సర్వే
- నష్టపరిహారానికీ అంచనాలు
- కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం,జూలై21(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో వివిధ అంశాలను త్వరితగతిన పరిష్కరించి పూర్తి చేయాల్సిందిగా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్‌లతోపాటు రైల్వే అధికారులు రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్నారు. భూసేకరణ పెండింగ్ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఇటీవల కోర్టు వెలువరించిన నేపథ్యంలో పాత, కొత్త అలైన్‌మెంట్‌ల ప్రకారం రెవెన్యూ, రైల్వే అధికారులు జాయింట్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. భట్నవిల్లి నుంచి గుడిమెళ్లంక వరకు జాయింట్ సర్వే త్వరితగతిన నిర్వహించి నివేదికను అందజేయాలని ఆదేశించారు. రైల్వేలైన్ భూసేకరణకు సంబంధించిన మ్యాప్‌లు, స్కెచ్‌లను పరిశీలించి కేసుల ఉపసంహరణ దిశగా చర్యలతోపాటు భూముల నష్టపరిహారానికి సంబంధించి మార్కెట్ విలువల ప్రకారం బడ్జెట్‌కు అనుగుణంగా అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. రైల్వే జూనియర్ ఇంజనీర్ పి.రాహుల్, భూసేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ ఏసుబాబు, దొరబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రాయోజిత అక్షరాస్యత 'ఉల్లాస్'పై జేసీ నిషాంతి సమీక్ష

అందరికీ అభ్యాస అవగాహనకోసం కేంద్ర ప్రాయోజిత అక్షరాస్యత 'ఉల్లాస్' ఆవిర్భవించిందని జాయింట్ కలెక్టర్ నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఈ అంశంపై అధికారులతో సమీక్షిస్తూ 15ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న నిరక్షరాస్యుల లక్ష్యంగా నిర్దేశించిన ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవిత నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, ప్రాథమిక విద్య వంటి కనీస సామర్థ్యాలను ఉల్లాస్‌లో పెంపొందిస్తారన్నారు. ఇంటర్ డ్రాపౌట్ విద్యార్థులను జాయిన్‌చేసి పరీక్షలు రాయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు, ఉపాధి వేతన కూలీల్లో నిరక్షరాస్యులకు దీనిద్వారా విద్య నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక మొబైల్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్‌చేసి చదవడం, రాయడం నేర్పిస్తారన్నారు. రోజు రెండు గంటల చొప్పున మొత్తం 200 గంటలపాటు విద్యాబోధన క్లాసులు జరగాలని ఆమె సూచించారు. ఈ ప్రోగ్రాంను జిల్లాలో మండల, స్కూలు లెవల్‌లో అమలు చేయనుండగా, జిల్లా విద్యాశాఖాధికారి ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తారన్నారు.

అవినీతి, అక్రమాలకు తావులేకుండా డీలర్లు పనిచేయాలి : జేసీ



రేషన్, ఎల్పీజీ డీలర్లతో సమీక్షిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం, జూలై21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రేషన్, ఎల్పీజీ గ్యాస్ పంపిణీ విషయంలో ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టాలని జేసీ నిషాంతి డీలర్లకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని చౌకధరల దుకాణాలు, ఎల్పీజీ గ్యాస్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డెలివరీపై ఐవీఆర్ఎస్ సంతృప్తి చెందారా, నిత్యావసర వస్తువుల నాణ్యత, డెలివరీ బాయ్ అవినీతికి పాల్పడుతున్నారా వంటి ప్రశ్నావళికి అనుగుణంగా లబ్ధిదారుని నుంచి ప్రతిస్పందనలను నిరంతరం సేకరించడం జరుగుతుందని చెప్పారు. గ్రేడింగ్‌ల విషయంలో జిల్లా అధికారుల పనితీరు నిర్దేశిస్తుందని ఆమె అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజల సంతృప్తి బాగానే ఉన్నప్పటికీ కొన్నిచోట్ల అవి వెనుకబడినట్టు వస్తున్నాయని, వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. వెనుకంజలో ఉన్న డీలర్లు మరింత చైతన్యవంతులు కావాలన్నారు. వెనుకబడిన వారికి దండించకుండా ఒక అవకాశం ఇవ్వడం జరుగుతుందని, తరువాత చర్యలుంటాయని హెచ్చరించారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా నెలనెలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దీపం-2 డెలివరీ బాగుందా, డెలివరీ బాయ్స్ ఉచితంగా ఇస్తున్నారా, డబ్బులు డిమాండ్ చేస్తున్నారా వంటి అంశాలపై ఆరా తీశారు. ఎక్కడైనా లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలని సూచించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఐదు మంది ఎల్పీజీ డీలర్లను జేసీ శాలువతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. 12 మంది రేషన్ డీలర్లకు ప్రశంసాపత్రాలు ఇచ్చారు. జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

జ..గన్.. మిథున్..!





బాస్ కోసం జిల్లాలో బరితెగింపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరాచకాలు, అక్రమాలకు, దందాలకు లెక్కేలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా అధికారం చెలాయించారు. వంతాడ మైనింగ్‌పై కన్నేసి లీజుదారులను బెదిరించి వాటాలు కొట్టేశారు. అప్పటి సీఎం జగన్ భారతి సిమెంట్ కంపెనీకి ఇక్కడి నుంచి రిజర్వ్ ఫారెస్టును తవ్వేసి మరీ లేటరైట్ పంపించారు. జగన్ కోసం కాకినాడ పోర్టు,కాకినాడ సెజ్ యజమానులను బెదిరించి వాటాలను అరబిందో కంపెనీకి రాయించడం కోసం ఏకంగా బెదిరింపులకు దిగారు. వందలకోట్ల పేదల ఇళ్ల స్థలాల చదునులో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడితో కలిపి కోట్లకు కోట్లు కొట్టేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం కుంభకోణంలో సంపాదించిన అక్రమ సొమ్మునే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాలకు తరలించి టీడీపీని ఓడించడానికి మిథున్‌రెడ్డి స్కెచ్ అమలుచేశారు. అప్పటి సీఎం జగన్ అండదండలతో ఉమ్మడి జిల్లాలో మిథున్‌రెడ్డి రెచ్చిపోయారు. రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారిగా అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నారు.

బెదిరించి..వాటాలు కొట్టేసి..

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ కొండల్లో లేటరైట్ సిమెంట్ తయారీ, అల్యూమినియం ఉత్పత్తికి ఆధారం. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆంద్రు శ్రీనివాస్ 2013లో వంతాడ కొండపై 20 ఏళ్ల పాటు 200 ఎకరాల్లో లీజులు దక్కించుకున్నారు. 41.25 లక్షల మెట్రిక్ టన్నుల లేటరైట్ గనులపై జగన్ ఆదేశాలతో మిథున్‌రెడ్డి కన్నేశారు. లీజుదారుడిని బెదిరించి బలవంతంగా డీల్ కుదిర్చారు. దీని ద్వారా ఏడాదికి అప్పటి ప్రభుత్వ పెద్దలు రూ.180 కోట్లు వెనకేసుకున్నారు.

రిజర్వ్‌ఫారెస్ట్ తవ్వించేశారు...

విశాఖ జిల్లా నాతవరం మండలం బమిడికిలొద్దు వద్ద లేటరైట్ కొండలపై జగన్ కన్ను పడింది. లీజుదారుడిని దారికితెచ్చుకుని మిథున్‌రెడ్డి వాలిపోయారు. తవ్విన లేటరైట్‌ను జాతీయరహదారి మీదుగా కడపలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించే దగ్గర చిక్కొచ్చింది. దీంతో మిథున్‌రెడ్డి పెద్ద స్కెచ్ వేశారు. బమిడికలొద్దు లేటరైట్ క్వారీకి అతి సమీపంలో రౌతులపూడి ఉండడంతో క్వారీ నుంచి జల్దాం వరకు రహదారిని నిర్మించి అక్కడి నుంచి కత్తిపూడి హైవే మీదుగా కడపకు లేటరైట్ తరలింపునకు స్కెచ్ వేశారు. ఈ మేరకు చెల్లూరు-బమిడికలొద్దు మధ్య ఉన్న ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రిజర్వ్‌ఫారెస్టును అటవీశాఖ అనుమతుల్లేకుండా తవ్విపారేశారు. ఇక్కడి నుంచి కడపలో భారతి సిమెంట్‌కు లేటరైట్ తరలించేశారు.

సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్‌రెడ్డి

లిక్కర్‌స్కామ్‌లో ఏ4, వైసీపీ ఎంపీ పెదిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ నంబర్ 4196 కేటాయించారు. సెంట్రల్ సూపరింటెండెంట్ రాహుల్ కథనం ప్రకారం. ఆదివారం రాత్రి 8.50 గంటలకు నిందితుడిని జైలులోకి తీసుకున్నారు. అతన్ని స్నేహా బ్లాక్ బ్యారక్‌లో ఉంచారు.

ఉమ్మడి జిల్లాతో మిథున్‌రెడ్డికి సంబంధం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో కడప జిల్లా రాజంపేట ఎంపీగా ఉన్న పీవీ మిథున్‌రెడ్డిని అప్పటి సీఎం జగన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు. అప్పటి నుంచీ మిథున్‌రెడ్డి జిల్లాలో చెలరేగిపోయారు. జగన్ మెప్పుకోసం.. జగన్ ఆర్థిక ప్రయోజనాల కోసం అడ్డంగా బరితెగించేశారు. కలెక్టర్లు, ఎస్పీలుగా ఎవరుండాలో ఆయనే డిసైడ్ చేసేవారు. అయితే అప్పటికే జగన్ ప్రభుత్వం తెచ్చిన మద్యం పాలసీలో మిథున్‌రెడ్డి కీలకంగా మారారు. మద్యం ముడుపులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలి? ఏబ్రాండ్‌లను అనుమతించాలి? వంటివన్నీ మిథున్‌రెడ్డి చక్కబెట్టారు. పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ నుంచి స్పిరిట్ కొనుగోలులోనూ చక్రం తిప్పినట్టు సమాచారం. ప్రభుత్వం మారాక గతేడాది మద్యం కుంభకోణానికి సంబంధించి సీఐడీ జరిపిన సోదాల్లో చినబ్రహ్మదేవంలోని కేబీకే బయోటెక్ కంపెనీ కూడా ఉంది. డిస్టిలరీల లెక్కలు, కేబీకే నుంచి వెళ్లిన సరుకు లెక్కల్లో వ్యత్యాసాలపై ఆరా తీసింది. తాజాగా ఈ కుంభకోణంలో మిథున్‌రెడ్డి పాత్ర బయటపడడంతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలుపాలయ్యారు.

- కన్నేస్తే ఖాళీ కావాల్సిందే
- నాడు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్
- ఐదేళ్లూ దందాలు.. దౌర్జన్యాలే
- ఎన్నికల్లో మద్యం, డబ్బు డంపింగ్
- నకిలీ మద్యం నిల్వలు
- లేటరైట్.. అక్రమాలు
- పేదల ఇళ్ల స్థలాల చదును
- కేబీకే బయోటెక్‌లో హస్తం
- లిక్కర్ స్కాంలో జైలుపాలు
- మిథున్‌రెడ్డి అరాచకాలెన్నెన్నో..

ఎన్నికల్లో.. డబ్బు..మందు...

ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హోదాలో మిథున్‌రెడ్డి గత ఎన్నికల్లో టీడీపీని ఓడించడానికి మద్యం, అక్రమ సొమ్ము వందల కోట్లలో ఇక్కడ డంప్ చేశారు. ఈమేరకు అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడితో స్కెచ్ వేశారు. పిఠాపురంలో పవన్‌ను ఓడించడానికి మిథున్‌రెడ్డి కొన్ని రోజులు జిల్లాలోనే మకాం వేశారు. కడప నుంచి నకిలీ మద్యాన్ని వ్యాన్లలో తరలించారు. ఒక్క పిఠాపురానికి కోట్లలో నకిలీ మద్యం డంప్ చేశారు. పోటీ తీవ్రంగా ఉన్న నియోజకవర్గాలకు రూ.30 కోట్లు, కోట్ల విలువైన మద్యం మిథున్‌రెడ్డి కనుసన్నల్లోనే పంపిణీ జరిగింది. ఈ మందు పలుచోట్ల జిల్లాల్లో పట్టుబడింది. ఈ బాటిళ్లు అత్యంత నాసిరకంగా తేల్చారు.

సెజ్‌లు..పోర్టు..

పదివేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాకినాడ సెజ్ దేశంలోనే పెద్దది. ఇందులో 51 శాతం జీఎమ్మార్, కాకినాడ డీప్ వాటర్‌పోర్టు నిర్వహణదారుడైన కేవీరావుకు 0.29 శాతం, ఆయనకే చెందిన కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్(కేఐహెచ్‌పీఎల్)కు 33.75 శాతం వాటాలున్నాయి. వీటన్నింటిపై జగన్ కన్నేయగా, మిథున్‌రెడ్డి రంగంలోకి దిగి వైవీ.విక్రాంత్‌రెడ్డితో కలిపి స్కెచ్ వేశారు. కేవీ రావును బెదిరించి వాటా రాయించేసుకున్నారు. కాకినాడ సీపోర్టు (డీప్‌వాటర్‌పోర్టు)పైనా జగన్ కన్నేయడంతో మిథున్‌రెడ్డి బెదిరించి 41.12శాతం వాటాను కేవీ రావు జగన్ చెప్పిన అరబిందోకు విక్రయించారు.

ఇలాగైతే సాగునీరు పారేదెలా?

- ప్రధాన పంటకాల్వలు అధ్వానం
- పట్టించుకోని ఇరిగేషన్, నీటి సంఘాలు



రాజవరం-పొదలాడ రోడ్డులో లంకలగన్నవరం వద్ద మూసుకుపోయిన ప్రధాన పంట కాల్వ

పి.గన్నవరం, జూలై21(ఆంధ్రజ్యోతి): గోదావరిలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ పంట చేల్లో మాత్రం నీరు కరువైంది. ప్రధాన పంట కాల్వల్లో సైతం గుర్రపుడెక్క పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. రాజవరం-పొదలాడ రహదారిలో అనేకచోట్ల గుర్రపుడెక్కతోపాటు తీగమొక్కలు పేరుకుపోయాయి. గుర్రపుడెక్కను తొలగించడానికి నిధులు మంజూరైయ్యాయని రాజకీయ పెద్దలు, అధికారులు చెప్పినా క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. వృక్షాలు, గుర్రపుడెక్క పేరుకుపోయి ప్రధాన పంటకాల్వలు అస్తవ్యస్థంగా కనిపిస్తున్నాయి. జూన్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు రెండుసార్లు కాల్వల్లో గుర్రపుడెక్క తొలగించాల్సి ఉంది. కానీ జూలై మాసాంతం పూర్తవుతున్నప్పటికీ ఇంకా పలుచోట్ల పంట కాల్వలు గుర్రపుడెక్కతోనే దర్శనమిస్తున్నాయి. సాగునీటి వేగానికి అడ్డంకులు తొలగిస్తే నీరు శివారు పంటచేలకు సైతం అందే అవకాశం ఉంది. అయితే ఇరిగేషన్ అధికారులు కాల్వలను కనీసం కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. మరోవైపు నీటిసంఘాలు వచ్చినప్పటికీ నీటిఎద్దడి బాధ తప్పడంలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడేళ్లుగా కన్నెత్తి చూడలేదు..

గడిచిన ఏడేళ్ల నుంచి పంటకాల్వలపై పాలకులు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో పంటకాల్వలు అధ్వానంగా మారాయి. పంట కాల్వల సామర్థ్యం బట్టి సాగునీరు విడుదల అవుతున్నప్పటికీ శివారు ప్రాంతాలకు నీరు అందడంలేదని నీటి సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. కాల్వల్లో పూడికతతీత భారీగా పెరగడంతోపాటు కాల్వలు బలహీనంగా మారాయని చెబుతున్నారు. పంటకాల్వ ప్రారంభంలో సాగునీరు పోటెత్తుతున్నప్పటికీ శివారు పంట పొలాలకు మాత్రం వెళ్లడం లేదు. ఇటీవలే పలు ఛానళ్ల పరిధిలో పంట కాల్వల్లో పూడికతీత పనులు నిర్వహించినప్పటికీ అనేక పంటకాల్వల గట్లు ఇప్పటికీ బలహీనంగానే ఉన్నాయి. దీనికితోడు పారుదల వ్యవస్థ అస్తవ్యస్థమైంది. దీంతో కాల్వల సామర్థ్యం మేర సాగునీరును విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంతాలకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం పంటకాల్వల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తే సాగునీరు ముందుకు పోతుందని రైతులు పేర్కొంటున్నారు.



ఈదరపల్లి గ్రామదేవత శ్రీగంగాదేవి పోలేరమ్మ అమ్మవారిని సోమవారం శాకంబరిగా అలంకరించారు. సమరసతా సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గ్రామ ఆడపడుచులు అమ్మవారికి చీర, సారె సమర్పించారు.
- అమలాపురం రూరల్

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 250 అర్జీలు



కలెక్టరేట్ గోదావరి భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రతీ సమస్యను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి : జిల్లా కలెక్టర్

అమలాపురం టౌన్, జూలై21(ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ప్రభుత్వం అర్జీదారుల సంతృప్తి స్థాయిలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నందున ప్రతీ సమస్యను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీలు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 250 అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో వచ్చే అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ప్రతీ జిల్లాస్థాయి అధికారి మూడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక అవసరాలను, నైపుణ్యాలను, కెరీర్ గైడెన్స్‌ను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా డివిజన్, మండలస్థాయి అధికారులు కనీసం రెండు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. ప్రతీ జిల్లాస్థాయి అధికారి ఒక సంక్షేమ వసతిగృహం, గురుకుల పాఠాలను దత్తత తీసుకుని నెలలో రెండు పర్యాయాలు సందర్శిస్తూ వసతిగృహ విద్యార్థుల అవసరాలు తీర్చాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, నియోజకవర్గ స్థాయి అధికారుల సహకారంతో బూత్ లెవెల్ అసిస్టెంట్‌లు సమన్వయంతో అర్హులైన యువతను ఓటర్లుగా నమోదుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ కార్యాలయానికి 32 అర్జీలు..

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో స్వయంగా మాట్లాడి రాత పూర్వక అర్జీలను స్వీకరించారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో నిర్దేశిత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ఎస్పీ కృష్ణారావు మొత్తం 32 అర్జీలను స్వీకరించారు.

సాగునీటి సరఫరాలో అడ్డంకులు!



మండపేట పట్టణంలోని గొల్లపుంత పొలాల్లో సాగునీరందించే పంటకాల్వ దుస్థితి ఇది

మండపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఆకుమడులు పడ్డాయి. నాట్లూ పడుతున్నాయి. కానీ ఈ దశలో సాగునీటి పారుదలకు అడ్డంకులు తప్పడం లేదు. మండపేట పట్టణ పరిధిలోని గొల్లపుంతకాలనీకి వెళ్లేదారిలో ఉన్న పంటకాల్వ వ్యర్థాలతో నిండి సాగునీరు పారేందుకు వీల్లేకుండాపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాగునీరు దిగువకు అందకపోవడంతో వరిచేలు దెబ్బతింటున్నాయని వారు చెబుతున్నారు. తమకు సాగునీరు అందించే పంటకాల్వలో వ్యర్థాలు, గుర్రపుడెక్క పెరిగిపోయి ఇబ్బంది కలుగుతోందని, దీనివల్ల అనేక పాట్లు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా తమ పంట కాల్వను ఇరిగేషన్‌శాఖ సాగునీటి సంఘాల అధ్యక్షులు పరిశీలించి సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతాంగం కోరుతోంది.

వర్షపాతం అత్యధికం కె.గంగవరం.. అత్యల్పం ఆత్రేయపురం

అమలాపురం, జూలై21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం భారీగా నమోదైంది. జిల్లాలో అత్యధిక వర్షపాతం కె.గంగవరం మండలంలో 44.2, అత్యల్పంగా ఆత్రేయపురం మండలంలో 0.8 మిల్లీమీటర్ల నమోదైంది. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం ఇలా ఉంది. మండపేటలో 11, రాయవరంలో 18.4, రామచంద్రపురంలో 30.4, ఆలమూరులో 4.0, రావులపాలెంలో 8.8, కొత్తపేటలో 4.8, కపిలేశ్వరపురంలో 5.0, ముమ్మిడివరంలో 26.6, ఐ.పోలవరంలో 25.4, అయినవిల్లిలో 17.2, పి.గన్నవరంలో 22.8, అంబాజీపేటలో 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మామిడికుదురులో 18.2, రాజోలులో 12.4, మలికిపురంలో 16.8, సఖినేటిపల్లిలో 8.8, అల్లవరంలో 28.4, ఉప్పలగుప్తంలో 22.8, కాట్రేనికోనలో 20.8 వర్షపాతం నమోదు కాగా జిల్లావ్యాప్తంగా 17.3 మిల్లీమీటర్ల వర్షపాతం సగటున నమోదైంది.

'ప్రభుత్వాసుపత్రిలో సిజేరియన్ ప్రసవాల రేటు తగ్గించాలి'

అమలాపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాల రేటును తగ్గించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర సూచించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో సోమవారం జిల్లాలోని రెండు ఏరియా ఆసుపత్రులు, తొమ్మిది కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న సిజేరియన్ ప్రసవాలపై సమీక్ష నిర్వహించారు. సిజేరియన్ ప్రసవాల రేటును తగ్గించేందుకు గైనకాలజిస్టులకు ఆయన పలు సూచనలు చేశారు. 2024-25లో మొత్తం ప్రసవాలు 3804 కాగా నార్మల్ 1593, సిజేరియన్ ప్రసవాలు 2211 జరిగాయన్నారు. 2025-26లో 942 ప్రసవాల్లో నార్మల్ 424 కాగా, సిజేరియన్ 418 ఉన్నాయన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.కార్తీక్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి పాల్గొన్నారు.




డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూపులు తప్పట్లేదు. తీవ్ర తర్జనభర్జనల అనంతరం డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి పలు నిబంధనలను సవరిస్తూ జీవో జారీ చేసింది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ లోనూ ప్రవేశం కోసం దరఖాస్తు చేసే అవకాశాన్ని కల్పించింది. కానీ ఇప్పటి వరకు అడ్మిషన్ల ప్రక్రియలో కీలకమైన ఓఏఎండీసీ వెబ్‌సైట్ (పోర్టల్) అప్డేట్ కాకపోగా, వెబ్ ఆప్షన్లు కూడా ఓపెన్ కాలేదు. ప్రభుత్వం జీవో ఇచ్చి ఆరు రోజులు దాటినా ఇంతవరకు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి మార్గదర్శకాలు, ప్రవేశాల షెడ్యూల్ రాకపోవడంపై విద్యా శాఖ వర్గాల్లోనే అసహనం వ్యక్తమవుతోంది.

గ్రీన్ సిగ్నల్

- డిగ్రీ అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతి
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే అవకాశం
- విద్యార్థుల ఆధార్ ఆథంటికేషన్ తప్పనిసరి
- అప్డేట్ కాని ఓఏఎండీసీ పోర్టల్
- ఓపెన్ కాని వెబ్ ఆప్షన్లు
- ప్రవేశాల షెడ్యూల్ కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఆరు రోజులు
- ఉన్నత విద్యా మండలి నుంచి విడుదల కాని మార్గదర్శకాలు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై ఉన్న సందిగ్ధత ఎట్టకేలకు తొలగింది. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చిన మూడు నెలల అనంతరం ప్రవేశాలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవేశాలను ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలనే విషయంలో తర్జనభర్జనల అనంతరం రెండు పద్ధతుల్లోనూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎస్సీ వర్గీకరణ అనంతరం జరుగుతున్న ప్రవేశాలు కావడంతో వాటిపైనా క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం జీవో జారీ చేసి ఆరు రోజులు దాటినా ఇప్పటిదాకా ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి మార్గదర్శకాలు, అడ్మిషన్ల షెడ్యూలు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే ఓఏఎండీసీ వెబ్‌సైట్ ఇంకా అప్డేట్ కాలేదు. ఇంకా 2024-25 అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌నే చూపిస్తోంది.



ఓఏఎండీసీ పోర్టల్‌లో ఇంకా 2024-25 అడ్మిషన్ల ప్రక్రియనే చూపిస్తున్న దృశ్యం

అన్ని వర్గాలతో చర్చించి...

కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురంల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి దాదాపు మూడు రెట్లు అదనంగా ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా సీట్లు ఉన్నాయి. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోనూ ఇదే స్థాయిలో కళాశాలలు ఉన్నాయి. వైసీపీ తీసుకువచ్చిన అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంగా ఉండడంతో దీనిలో మార్పు చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్ణయం తీసుకుంది. దీనిపై ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, విద్యావేత్తలతో చర్చించింది. ఆన్‌లైన్ ప్రక్రియను కొనసాగిస్తూనే పాత పద్ధతిలో కళాశాలల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే విధానం అమలు చేయాలని ఎక్కువ మంది సూచించారు. దీంతో దీనిని ఖరారు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ జీవో నెం.45 జారీ చేశారు.

అదే విధంగా డిగ్రీలో ప్రస్తుతం ఉన్న సింగిల్ సబ్జెక్టు విధానంలో స్వల్ప మార్పులతో పాత విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ తదితర కోర్సుల్లో డిగ్రీలు, హానర్స్ డిగ్రీలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ డిగ్రీ కాలేజెస్ ఆన్‌లైన్ అడ్మిషన్ రూల్స్-2020లో సవరణలు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీని ప్రకారం ఆయా కోర్సుల్లో డిగ్రీ చేసేందుకు (బీఏ, బీకాం, బీఎస్సీ) ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఇందులోనే తమకు నచ్చిన కళాశాల, కోర్సును ఆర్డర్ ఆఫ్ ప్రిఫరెన్స్‌లో ఎంచుకునే అవకాశం కల్పించారు. లేకుంటే తమకు అందుబాటులో ఉండే (లేదా) నచ్చిన కళాశాలలో విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఆయా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకుని విద్యార్థులకు రసీదు ఇవ్వడంతో పాటు ఓఏఎండీసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రెండు విధానాల్లోనూ దరఖాస్తుకు ఆధార్ ఆథంటికేషన్ తప్పనిసరి చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థి దరఖాస్తు చేసుకుంటే స్వయంగా కళాశాలలో ఇచ్చిన అప్లికేషన్‌లోని ఆప్షన్లనే పరిగణలోకి తీసుకుంటారు.

ఉత్తర్వులిచ్చి ఆరు రోజులైనా...

డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఐదు రోజులు దాటింది. ఇప్పటి వరకు ఏపీ ఉన్నత విద్యా మండలి నుంచి ప్రవేశాల షెడ్యూల్, మార్గదర్శకాలు మాత్రం విడుదల కాలేదు. కనీసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించే ఓఏఎండీసీ పోర్టల్‌ను ఇప్పటిదాకా అప్డేట్ చేయలేదు. అందులో ఇంకా 2024-25 అడ్మిషన్ల ప్రక్రియ, అప్పటి నోటిఫికేషన్లనే చూపిస్తోంది. ప్రతిరోజూ ఈ పోర్టల్‌ను తనిఖీ చేసుకుంటున్న విద్యార్థులకు నిరాశే మిగులుతోంది.

త్వరితగతిన పూర్తి చేయాలి

ఇంటర్ పరీక్షా ఫలితాలు వచ్చి మూడు నెలలు దాటినందున డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యావేత్తలు కోరుతున్నారు. మూడు, నాలుగు వారాలు లోపుగానే దరఖాస్తులు, వెబ్ ఆప్షన్ల స్వీకరణ, అలాట్‌మెంట్ పూర్తయితే విద్యా సంవత్సరాన్ని త్వరగా ప్రారంభించే వీలుంటుందని వారు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినా మార్గదర్శకాలు, అడ్మిషన్ షెడ్యూల్ ఇవ్వడానికి ఏపీ ఉన్నత విద్యా మండలి ఇంత సమయం తీసుకోవడం సరికాదంటున్నారు. కాగా రెండు, మూడు రోజుల్లో ప్రవేశాల షెడ్యూల్ ఇవ్వడంతో పాటు వెబ్ ఆప్షన్లు ఓపెన్ అవుతాయని భావిస్తున్నామని ఉన్నత విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.


పిఠాపురంలో శాకంబరిగా దర్శనమిచ్చిన పురుహూతికా అమ్మవారు

శరణు... శరణు... శాకంబరీ

చల్లగా చూడు తల్లీ అంటూ ఆషాఢంలో ప్రత్యేక అలంకరణలు

ఆషాఢంలో అమ్మవార్ల జాతరలు మొదలవుతాయి. ఈ మాసంలో అమ్మవార్ల ఆశీస్సులు తీసుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా ఈ మాసం రాగానే పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయాలను సందర్శిస్తారు. కాకినాడ జిల్లాలోని తలుపులమ్మ లోవ, మరిడమ్మ జాతరలతో పాటు పలు ప్రముఖ ఆలయాలు, చిన్న ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేస్తారు. అమ్మవార్లు శాకం బరిగా దర్శనమిస్తారు. రకరకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి పూజిస్తారు. ఇలా చేయడం వల్ల సర్వసుఖాలు, విజయాలు, కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.


కాకినాడలో శాకంబరి అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు

(కాకినాడ/సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

ఆషాఢ మాసంలో అమ్మవార్లను కూరగాయలతో అలంకరించే సంప్రదాయం శాకంబరీదేవి ఉత్సవాల్లో భాగం. శాకంబరి అంటే కూరగాయల తల్లి అని అర్థం. ఒకసారి కరువు వచ్చినప్పుడు ప్రజల బాధను చూసి చలించిన అమ్మవారు తనను తాను శాకంబరిగా మార్చుకుని అనేక రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సృష్టించి ప్రజలను కరువు నుంచి కాపాడినట్టు పురాణాలు చెప్తున్నాయి. అప్పట్నుంచీ అమ్మవారిని శాకంబరిగా పూజించే సంప్రదాయం మొదలైందని పండితులు చెప్తున్నారు. ఆషాఢంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించడం వల్ల, పంటలు బాగా పండి, ప్రజలకు ఆహార కొరత లేకుండా ఉంటుందని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో మహిమాన్విత రూపంలో ఉండే అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అన్ని కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ అలంకరణలో అమ్మవారిని ఆహార పదార్థాలకు అధిదేవతగా ఆరాధిస్తారు. పౌర్ణమి వంటి దివ్య తిథుల్లో జరిగే ఉత్సవాలు, కైంకర్యాలు, పూజలతో పాటు ఆషాఢ మాసంలో అమ్మవారికి కూరగాయల అలంకరణను భక్తులే వారి చేతులతో స్వయంగా చేస్తారు.

ముందుగానే విగ్రహాల సైజులను బట్టి కూరగాయల దండలు తయారు చేస్తారు. ఆలయం మొత్తాన్ని కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరించడం ఆనవాయితీగా మారింది. తోటకూర, గోంగూర, వేపాకు, కరివేపాకు, మామిడాకులు వంటి ఆకులతో పాటు, అమ్మవారి మెడలో ధగధగ మెరిసేలా కలర్‌ఫుల్ క్యారెట్, బీట్‌రూట్, బంగాళాదుంపలు, వంకాయలు, బెండకాయలు... ఇలా రకరకాల కూరగాయలతో పాటు ప్రస్తుత సీజన్లో లభించే పైనాపిల్, కర్బూజా దానిమ్మ, బత్తాయి... ఇలా అనేక రకాల పండ్లతో ఆలయాన్ని అందంగా అలంకరిస్తారు. ఒకప్పుడు పెద్ద పెద్ద ప్రముఖ ఆలయాల్లో మాత్రమే కనిపించే ఈ అలంకరణ సంప్రదాయం ప్రస్తుతం వీధుల్లోని చిన్న ఆలయాలకు సైతం చేరింది. క్వింటాళ్లలో కూరగాయలు కొనుగోలు చేసి మరీ అలంకరిస్తున్నారు.

ఆషాఢ మాసంలో శాకంబరీ దేవికి సారె కూడా సమర్పిస్తుంటారు. వర్షాలు కురిసి, పంటలు బాగా పండి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కృతజ్ఞతాపూర్వకంగా రైతులు పిండి వంటలు, పండ్లు, స్వీట్లతో అమ్మవారికి సారె సమర్పిస్తారని పండితులు, ఆచార సంప్రదాయాలు తెలిసిన పెద్దలు చెప్తున్నారు.


కాకినాడలో బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయాన్ని కూరగాయలతో తీర్చిదిద్దిన దృశ్యం

ఐదేళ్లలో ఎన్ని చమురు నిల్వలు కనుగొన్నారు?

పెట్రోలియం, సహజవాయువులపై పార్లమెంట్‌లో సతీష్‌బాబు ప్రశ్నలు


బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్‌తో సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, సహజవాయువులపై సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పలు ప్రశ్నలు వేశారు. గత ఐదేళ్లలో కనుగొన్న చమురు, గ్యాస్ నిల్వలపై ప్రభుత్వం ఏమైనా అధ్యయనాలు, పరిశోధనలు చేసిందా, అలాగే గత ఐదేళ్లలో రాష్ట్రాలవారీగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన అన్వేషణ ప్రాజెక్టులు వివరాలు తెలపాలని కోరారు. ప్రాంతాలవారీగా కనుగొన్న నిల్వల పరిమాణం, వాటి వినియోగానికి తీసుకున్న చర్యలు వెల్లడించాలన్నారు. ఈ ప్రాజెక్టులకు వినియోగించిన మొత్తం నిధులు, బేసిన్ ఎంపిక, వాణిజ్య సాధ్యత మూల్యాంకనం, పర్యావరణ అంచనాలపై అనుసరించే ప్రమాణాలు తెలియజేయాలన్నారు. అలాగే మిషన్ అన్వేషణ్ స్థితి, పెట్టుబడులు ఆకర్షించడానికి సాంకేతిక బదిలీని ప్రోత్సహించడానికి, వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను విస్తరించడానికి తీసుకున్న చర్యలు ఏమిటో తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ కింద సేకరించిన మొత్తం నిధులు, కాకినాడతో పాటుగా జిల్లాల వారీగా తెలపాలన్నారు. ఈ ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలో చమురు, గ్యాస్ నిల్వలను అంచనా వేయడానికి వివిధ సర్వేలు జరుగుతున్నాయన్నారు. వివిధ పాలసీల కింద కేంద్ర ప్రభుత్వం మొత్తం 112 బ్లాక్‌లను మంజూరు చేసిందన్నారు. ఈ బ్లాక్‌లను పొందిన ఆపరేటర్లు గత ఐదేళ్లలో 101 అన్వేషన బావులను తవ్వారని స్పష్టం చేశారు. ఈ కార్యకలాపాల నిర్వహణ కోసం రూ.4,448 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అలాగే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో మినరల్, రెవెన్యూ జనరేషన్‌లో లేటరైట్స్‌కి రూ.36.86 కోట్లు ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ వివరాలను ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన సానా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్‌ను సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ కొద్దిసేపు భేటీ అయ్యారు.


స్వల్పంగా పెరుగుతున్న నీటి మట్టం

స్వల్పంగా పెరిగిన వరద

ధవళేశ్వరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వల్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరికి వరద స్వల్పంగా పెరిగింది. కాటన్ బ్యారేజ్ నుంచి 64,663 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా పరిధిలో కురుస్తున్న వర్షాలు వల్ల కాలువలకు సాగునీటి విడుదల తగ్గించారు. తూర్పుడెల్టాకు 3800క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2300క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4700క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం స్వల్పంగా పెరిగి 13.70 అడుగులుగా నమోదయింది.

మోతుగూడెంలో అఖండ-2 సినిమా సందడి


సీలేరు నది తీరాన డ్రోన్ కెమెరాతో ట్రైలర్ షూటింగ్ చేస్తున్న డైరెక్టర్ బోయపాటి శీను



మోతుగూడెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరివాహక ప్రాంతాల్లో ఐదు రోజులు అఖండ-2 సినిమా చిత్రీకరణ జరుగనుంది.అఖండ సినిమాకు దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజీతో అఖండ-2పై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శీను సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న అఖండ-2 చిత్రీకరణలో భాగంగా మోతుగూడెంలో బోయపాటి శ్రీను, చిత్ర బృందం కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఏజెన్సీలో దట్టమైన అడవుల్లో, ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులో, మోతుగూడెం గ్రామంలోని సీలేరు నది పరివాహక ప్రాంతాలైన ధారాలమ్మ ఆలయ వెనుక సీలేరు నది, పొల్లూరు జలపాతం వద్ద చిత్రీకరణ ప్రారంభించారు. అగ్ర కథానాయకుడు బాలకృష్ణపై ఐదు రోజులపాటు కొన్ని సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 25న విడుదల చేస్తామని దర్శకుడు బోయపాటి తెలిపారు.

ద్రాక్షారామలో ముగిసిన సప్తసప్తాహం


పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

ద్రాక్షారామ, జూలై 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి సన్నిధిలో జూన్ 2 నుంచి నిర్వహిస్తున్న సప్తసప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతారాముల శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం జరిపారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. ఒంటె ప్రదర్శన, కోలాట నృత్యాలు, బ్యాండు వాయిద్యాలు, చింతూరు గిరిజన ఆదివాసీ నృత్యప్రదర్శన, కేరళ వాయిద్యాలతో నగరోత్సవం జరిగింది. రాత్రి త్రిరత్నాల పేరిట రంగస్థల నాటికలు ప్రదర్శించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలభక్త సమాజం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వందే భారత్‌కు సామర్లకోటలో హాల్ట్ పొడిగింపు



సామర్లకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా అటు విశాఖ ఇటు సికింద్రాబాద్‌లకు రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ సూపర్ ఫాస్ట్‌ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్‌ను మరో ఆరు నెలలు పెంచుతూ రైల్వే సీనియర్ డీవోఎం కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు అందాయి. గతంలో జారీ చేసిన హాల్ట్ ఉత్తర్వులను మరో ఆరునెలలు పొడిగించారు. ఈ ఉత్తర్వులు ఆగస్టు 2 నుంచి అమలులోకి రానుంది.

- 20833 నెంబరు గల విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సామర్లకోటకు ఉదయం 7.26 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరం నకు 8.00 గంటలకు చేరుతుంది
- 20834 నెంబరు గల సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాజమహేంద్రవరంనకు రాత్రి 8.43 నిముషాలకు చేరుతుంది. సామర్లకోటకు రాత్రి 9.23 చేరుతుంది. ఈ రైలులో ప్రయాణించే ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు రిజర్వేషన్ టిక్కెట్లు పొందగోరే వారు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్ ఉన్న స్టేషన్‌లలోని బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ సోమవారం రాత్రి తెలిపారు.

చెయ్యేరు సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ప్రమాణస్వీకారం


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చెయ్యేరు సొసైటీ అధ్యక్షుడిగా త్సవటపల్లి శ్రీనివాస్‌తో పాటు డైరెక్టర్లుగా గుబ్బల రమేష్, పెయ్యల ముత్యాలరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడారు. సంఘ సభ్యులు, రైతుల మద్దతుతో చెయ్యేరు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యే సుబ్బరాజుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాస్ నాయకత్వ పటిమ సంఘాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, త్సవటపల్లి నాగేంద్ర, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, గంధం పళ్ళంరాజు, గొలకోటి వెంకటరెడ్డి, కల్వకొలను తాతాజీ, త్సవటపల్లి నాగభూషణం, సర్పంచ్ చెల్లి సురేష్, నంద్యాల వెంకటేశ్వరరావు, టీబీవీ నారాయణస్వామి, నంద్యాల చంటి, ఎంపీటీసీ గుత్తుల సూర్యమహాలక్ష్మి, నడింపల్లి సుబ్బరాజు, చింతపల్లి అజయ్‌కుమార్, సలాది నానాజీ, పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో యూసీఈకే విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో యూసీఈకే విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పెట్రోలియం ఇంజనీరింగ్ విద్యార్థి కె.అభిరామ్ ఆర్టిస్టిక్ సోలో, ట్విస్టింగ్ బాడీ ఇండివిడ్యువల్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థినులు గీతాసంజన, శైలజ ఆర్టిస్ట్ ఫెయిర్ విభాగంలో మొదటి స్థానం సాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన డాక్టర్ చంద్రు సుధాదేవిని జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు.

చంద్రకుమార్‌కు గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు

అమలాపురం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధినేత ఆకొండి అంజి ఆధ్వర్యంలో సింధూర్-సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్ అనే అంశంపై జాతీయస్థాయిలో చిత్రకళా పోటీలు నిర్వహించారు. 15 రాష్ట్రాల నుంచి 250 మంది చిత్రకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన ఆపరేషన్ సిందూర్ చిత్రానికి గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు లభించింది. వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ (వైమానిక దళం), కల్నల్ సోఫియాఖురేషి(ఆర్మీ) చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి ఆయన గీసారు. ఈ సందర్భంగా చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.



◄ చంద్రకుమార్ గీసిన ఆపరేషన్ సిందూర్ చిత్రం

వైద్యం కోసం విజయవాడ వెళ్తుంటే..

లారీ ఢీకొని ఇద్దరి మృతి

కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలో ఘటన

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్లలో విషాదఛాయలు



రాఘవ (ఫైల్)



మృతిచెందిన పసలపూడి రాఘవ, యల్లమిల్లి భాస్కరరావు

దేవరపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పసలపూడి రాఘవ (25), తన బావ యల్లమిల్లి భాస్కరరావు(50)తో కలిసి సోమవారం విజయవాడ పయనమయ్యారు. తాడేపల్లిగూడెం మండలం జమ్మికృష్ణంపాలెనికి చెందిన భాస్కరరావు గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో వైద్యం నిమిత్తం వారిద్దరు పల్లంట్ల నుంచి విజయవాడ ఆసుపత్రికి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ సమీపంలోని పాములపాడు వద్ద లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రాఘవ పెయింటర్‌గా పనిచేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఇద్దరి మృతితో పల్లంట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మంచినీరు అడిగి..

మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని పరారీ

మామిడికుదురు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామంలో మహిళ మెడలో పుస్తెలతాడు లాక్కుని దుండగుడు పరారైన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. నగరం ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాశర్లపూడి గ్రామానికి చెందిన వలవల వరలక్ష్మి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తాగేందుకు మంచినీరు కావాలని అడిగాడు. నీటిని తీసుకెళ్లి కొంతసేపటి తరువాత మళ్లీ వచ్చి మీ సెల్‌ఫోన్ ఇవ్వమని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో అతడు మహిళ గొంతును పట్టుకునేందుకు ప్రయత్నించగా కేకలు వేయడానికి ప్రయత్నించగా బెదిరించి నోరు నొక్కి, మెడలోని రెండున్నర కాసుల పుస్తెల తాడును తెంచుకుని మోటారు సైకిల్‌పై పారిపోయాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చైతన్యకుమార్ పేర్కొన్నారు.

దారి కాచి దొంగతనం

- ఎనిమిది మంది అరెస్టు
- నిందితుల్లో నలుగురు మైనర్లు
- మూడు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం



బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య, అనపర్తి సీఐ సుమంత్

బిక్కవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దారి కాచి దొంగతనం చేసిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ బి.విద్య తెలిపారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ, అనపర్తి సీఐ సుమంత్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఊలపల్లికి చెందిన కరుపోతు వరప్రసాద్ గోకవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా బలభద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వచ్చేసరికి రాజానగరం వైపు 3 బైక్‌లపై వెళ్తున్న ఎనిమిది మంది అడ్డగించి భయభ్రాంతులకు గురి చేసి అతడి వద్ద ఉన్న రూ.1550 నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పోయారు. దీంతో వరప్రసాద్ 112కు ఫోన్ చేయగా బిక్కవోలు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అతడి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. దీంతో సీఐ సుమంత్, ఎస్ఐ రవిచంద్రకుమార్, సిబ్బందితో దర్యాప్తు జరిపి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని డీఎస్పీ తెలిపారు. రిమాండ్‌కు పంపిన వారిలో బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన బదిరెడ్డి శ్రీసాయి, ఖండవిల్లి సాయి, రాయవరం మండలం వెదురుపాక సావరం గ్రామానికి చెందిన మేడిశెట్టి కుమార్, కురుపూడి అభిలాష్, నలుగురు బాల నేరస్తులు ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి మూడు మోటార్‌సైకిళ్లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారని వివరించారు.

గంజాయితో ఏడుగురి అరెస్ట్

5 కిలోల గంజాయితో పాటు రూ.3 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం



నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ జగన్మోహనరావు

నిడదవోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు జగనన్న కాలనీలో గంజాయితో ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఆదివారం రాత్రి సీఐ పీవీజీ తిలక్ ఆదేశాలతో తమకు వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. జగనన్న కాలనీకి చెందిన వెలిచర్ల నాగరాజు, ఉజ్జినవారి వీధికి చెందిన చవాన్ పండు, కాకివారి వీధికి చెందిన కాకి కార్తీక్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన నక్కల రసీల్, శాంతినగర్‌కు చెందిన మహ్మద్ దస్తగిరి అలియాస్ సమీర్, ఉజ్జినవారి వీధికి చెందిన గేదెల హేమంత్ నాగదుర్గ, చర్చిపేటకు చెందిన దూలపల్లి రాజేష్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 5 కిలోల గంజాయి సుమారు రూ.40వేలు ఉంటుందని, అలాగే రూ.3 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాజమండ్రి హుకుంపేటకు చెందిన పసుపులేటి కీర్తన వద్ద గంజాయిని కొనుగోలు చేసి వారంతా కాలేజీల వద్ద 50 గ్రాములు రూ.500 రూపాయిల చొప్పున విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మద్యం దుకాణంలో రూ.3.5 లక్షల నగదు చోరీ

మండపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద దుళ్లరోడ్డులో ఉన్న మద్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడి రూ.3.5లక్షల నగదుతో పాటు దుకాణంలో ఉన్న సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను చోరీ చేశారు. సోమవారం ఉదయం దుకాణం నిర్వాహకులు తెరిచేందుకువెళ్లగా చోరీ జరిగినట్టు గుర్తించారు. సంఘటనా ప్రదేశాన్ని రామచంద్రపురం ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐ కిషోర్, క్లూస్‌టీం పరిశీలించారు. జరిగిన సంఘటనపై యాజమాని నుంచి ఆరాతీశారు. యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆగస్టు 1న నాలుగు రాష్ట్రాల మాదిగ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం

అన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు రిజర్వేషన్ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఆగస్టు 1న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి మాదిగ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని మాదిగ న్యాయవాదుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ.రత్నం పేర్కొన్నారు. సోమవారం కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడిని దర్శించుకున్న ఆయన కొండదిగువున మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోగ్యం బాగుండాలని పూజలు నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం సమావేశంలో సుమారు 4వేలమంది మాదిగ న్యాయవాదుల సమక్షంలో వారికి ఘనసన్మానం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క మాదిగ న్యాయవాది ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిలాడి దయానందరావు, పలివెల సతీష్, కొత్తపల్లి ప్రసాదరావు, జయరాజ్, కొండేపూడి ఉదయ్‌కుమార్ ఉన్నారు.



అన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న వీవీ రత్నం

రూ.1.5 కోట్ల విలువైన స్థలం స్వాధీనం

ట్రిబ్యునల్ ఆదేశాలతో దేవదాయశాఖ అధికారుల చర్యలు



ఎడ్యుకేషనల్ ట్రస్టు స్థలం స్వాధీనం చేసుకున్న అధికారులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన రూ.1.5 కోట్ల విలువైన 45 సెంట్ల స్థలాన్ని సోమవారం దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రపురం ద్రాక్షారామ మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషన్ ట్రస్టుకు చెందిన 45 సెంట్ల స్థలంలో ప్రయివేటు వ్యక్తులు సామిల్లు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా పరిషత్‌కు లీజు చెల్లించేవారు. తదుపరి దేవదాయ శాఖకు జెడ్పీ నుంచి ఆస్తులు బదిలీఅయిన తరువాత కొంత కాలంపాటు పేర్రాజుపంతులు ఎడ్యుకేషన్ ట్రస్టుకు లీజు చెల్లించారు. తదుపరి ఎటువంటి లీజు చెల్లించకపోవడంతో ఎడ్యుకేషనల్ ట్రస్టు ఈవో దేవదాయశాఖ ట్రిబునల్‌ను ఆశ్రయించారు. 45 సెంట్ల స్థలం కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు స్వాధీనం చేయాలని ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో దేవదాయశాఖ డివిజన్ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈవో ఎస్.సత్యనారాయణ ఆలయ సిబ్బంది స్థలంలో ప్రవేశించి స్వాధీనం చేసుకున్నారు. ముందుగా నోటీసు ఇచ్చిన ప్రకారం ఆక్రమణదారులు దేవదాయశాఖ అధికారులకు స్థలాన్ని అప్పగించారు. ఖాళీ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సత్యనారాయణ ఆదేశాల మేరకు స్థలానికి ఇనప కంచె ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ పరిధిలో వివిధ ఆలయాల ఈవోలు జొన్నాడ భీమశంకరం, యాళ్లవీరవెంకట సత్యనారాయణ, వి.బాలకృష్ణ, వి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని మేకల కాపరి మృతి



మాధవరావు (ఫైల్)

తునిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో సోమవారం రైలు ఢీకొని మేకల కాపరి మృతిచెందాడు. మృతుడు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పక్కుర్తి చిన్నమాధవరావు(58)గా గుర్తించామని రైల్వే పోలీసులు తెలిపారు. మేకలను తోలుకెళ్తుండగా కొన్ని మేకలు రైల్వే ట్రాక్ పైకి వెళ్లడంతో వాటిని తరిమే క్రమంలో రైలు ఢీకొని మాధవరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి శవపంచనామా అనంతరం సంబంధికులకు అప్పగించినట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఫిట్స్‌తో పీక కోసుకున్న వ్యక్తి

చికిత్స పొందుతూ మృతి

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పీక కోసుకుని చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం గోవర్ధనగిరిమెట్టకు చెందిన కాంద్రుకోట చిన్ని గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఫిట్స్ వచ్చినప్పుడు తనను గాయపర్చుకుంటూ, ఇతరులను గాయపరిచేవాడు. ఈనెల 19న ఇంటి వద్ద ఫిట్స్ రావడంతో చాకుతో పీక కోసుకున్నాడు. దీంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈమేరకు అతడి భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైనట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన కొనగళ్ళ సూర్యచంద్రం టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కొవ్వూరు వస్తుండగా ఎదురుగా బైక్ ఢీకొంది. రెండు వాహనాలపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. సూర్యచంద్రం కుమారుడు ప్రసాద్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

హైదరాబాద్‌కు ముద్రగడ తరలింపు

యశోద ఆసుపత్రిలో అడ్మిట్ చేసిన కుటుంబసభ్యులు



కిర్లంపూడిలో ముద్రగడ స్వగృహం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న కుటుంబీకులు

కిర్లంపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల సమస్యతో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం రెండు రోజులుగా కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్ తీసుకెళ్లి హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. సోమవారం ఆయన్ను మెడికవర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా వైద్యుల పర్యవేక్షణలో స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడికి తీసుకువచ్చారు. ముద్రగడ సతీమణి పద్మావతి, కుటుంబీకులు ఆయన్ను చూసి కలవరపడ్డారు. ముద్రగడను ఇంట్లో కొద్దిసేపు ఉంచి వెంటనే అంబులెన్స్ ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. మాజీ మంత్రి తోట నరసింహం, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ముద్రగడ అభిమానులు ముద్రగడ స్వగృహానికి చేరుకున్నారు. ఎవరూ అధైర్యపడవద్దని, ముద్రగడ ఆరోగ్యంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నామని ఆయన కుమారుడు గిరిబాబు చెప్పారు.

ఐదు ఆసుపత్రులు తిప్పినా దక్కని శిశువు ప్రాణం

అల్లూరి జిల్లా ఓకుర్తిలో ఘటన

రాజవొమ్మంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన శిశువుకు మెరుగైన వైద్యం అందించేందుకు ఐదు ఆసుపత్రులు తిప్పి చివరకు కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లినా ప్రాణం పోయిన ఘటన అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలో జరిగింది. మండలంలోని వాతంగి పంచాయతి ఓకుర్తి గ్రామానికి చెందిన గోళ్ల సరోజ ఏప్రిల్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డ జూలై 18న అనారోగ్యానికి గురికావడంతో జడ్డంగి పీహెచ్‌సీ, అక్కడ నుంచి మెరుగైన వైద్యానికి అడ్డతీగల సీహెచ్‌సీ, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చివరకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఆ బిడ్డ 19న రాత్రి మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జి సీడీపీవో దేవమణిని వివరణ కోరగా అంగన్‌వాడీ వర్కర్ వివరాలు తెలిపారని, అయితే స్పష్టత లేదని చెప్పడం గమనార్హం.

తల్లీ, కుమార్తెల అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తల్లికుమార్తెల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు మహిళా హెడ్ కానిస్టేబుల్ లలితకుమారి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన మర్రి ఈశ్వరి, ఏడాదిన్నర కుమార్తెను తీసుకుని జూన్ నెలలో ఏలేశ్వరం అత్తగారింటి నుంచి కొవ్వూరు వచ్చింది. వారం రోజుల తరువాత ఏలేశ్వరం వెళ్లింది. అప్పటి నుంచి భర్త, అమ్మతో ఫోన్ మాట్లాడుతుంది. ఇటీవల తల్లి గుడిదాటి దివ్య కూతురు, మనుమరాలిని చూడడానికి వస్తున్నానని తెలపడంతో ఏలేశ్వరం వెళ్లలేదని తెలిసింది. దీంతో దివ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేశారు.

గోదావరిలో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం లభ్యం



దినేష్ మృతదేహం

ఆత్రేయపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చి గౌతమి గోదావరి నదిలో శనివారం ఉదయం 5 గంటల సమయంలో స్నానం ఆచరిస్తుండగా ఖమ్మం జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్(22) గల్లంతయ్యాడు. శనివారం నుంచి సోమవారం వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ విద్యాసాగర్, తహశీల్దార్ రాజేశ్వరరావు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, పోలీస్, గజఈతగాళ్లతో 3 బృందాలుగా విడిపోయి 30 మంది గాలింపు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ముక్తేశ్వరం- కోటిపల్లి ఫెర్రి సమీపంలో దినేష్ మృతదేహం లభ్యమైంది. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత

తండ్రి మృతిపై కుమారుడి అనుమానం

కోనసీమ జిల్లా ఇప్పనపాడులో శవాన్ని పరిశీలించిన పోలీసులు



ఇప్పనపాడులో మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలిస్తున్న పోలీసులు

మండపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇప్పనపాడు పంచాయతీ పరిధిలోగల ఎర్రదిబ్బలకాలనీకి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో పూడ్చిపెట్టిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వైద్యులకు సిఫార్సు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పనపాడుకి చెందిన వాకాడ వీర్రాజు(47) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు అయ్యాయి. వీర్రాజు కుమార్తె భర్తతో గొడవల కారణంగా తల్లితండ్రుల వద్ద ఉంటోంది. ఈనెల 17న వీర్రాజు భార్యతో గొడవపడ్డాడు. ఆ మరుసటి రోజు గుండెపోటుతో తన భర్త మరణించాడని ఆమె భార్య చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. కుమార్తె కూడా వీర్రాజు గుండెపోటుతో మరణించాడని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించారు. వీర్రాజు కుమారుడు వచ్చిన తర్వాత తన తల్లి ఫోన్ సంభాషణ విని తండ్రి మరణానికి తల్లి, సోదరే కారణమని అనుమానం కలిగింది. దీంతో మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సోమవారం శవాన్ని వెలికి తీసి మండపేట రూరల్ సీఐ దొర్రాజు, మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు, పోలీసులు, వైద్యుల సమక్షంలో పరిశీలించారు. మృతదేహంపై గాయాలు ఉన్నట్టు గుర్తించారు. పోస్టుమార్టం రిపోర్ట్ వస్తే కాని ఏమీ చెప్పబోమని పోలీసులు తెలిపారు. నిద్రిస్తున్న వీర్రాజును హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని కుమారుడు ఆరోపించాడు.

సత్యదేవుడి సన్నిధిలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం జగ్గయ్యపేట ఎమ్మెల్యే

అన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు. లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరక్టర్లు నిర్మించిన ప్రసాదం తయారీభవనం, ఉచిత కల్యాణమండపాలను పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మట్టే ఆదిత్య కృష్ణ తదితరులున్నారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

రూ.37.84 లక్షల ఆదాయం

పెద్దాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ జాతరకు ఆది, సోమవారాల్లో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. సుమారు 35వేలమంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారని దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచు కుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంధ సంస్థలు భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదం పంపిణీ చేశాయి. మరిడమ్మ హుండీల్లో కానుకలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 34 రోజులకు రూ.37,84, 015 ఆదాయం వచ్చిందని విజయలక్ష్మి తెలిపారు. లెక్కింపులో సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.



మరిడమ్మ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కందికుప్పలో విషజ్వరాలు

వైద్యశిబిరాలు ఏర్పాటు చేసిన అధికారులు

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప పంచాయతీ జమ్మిచెరువు కాలనీలో విషజ్వరాలు ప్రబలడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాళ్లు చేతులూ, శరీర కండరాలు మెలిపెడుతున్న నొప్పితో డెంగ్యూ, మలేరియా జ్వరాలుగా భావించి భయానక వాతావరణం నెలకొంది. గత వారం రోజులుగా విషజ్వరాలతో బాధపడుతున్న గ్రామస్తులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి వెళ్లగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ముమ్మిడివరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన మందులు అందిస్తున్నారు. దోమలతో పాటు ఇక్కడ మలేరియా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు రావచ్చని ప్రజలు భయపడుతున్నారు. గత నాలుగు రోజులుగా కుళాయిల ద్వారా మట్టినీళ్లు వస్తున్నాయని అంటున్నారు. ఈ కలుషిత నీటి వల్ల డెంగ్యూ, మలేరియా, అతిసార, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముందని ప్రజలు భయపడుతున్నారు.



కందికుప్పలో కలుషిత నీరు

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో...

మౌలిక సదుపాయాల పరిశీలనకు కమిటీలు

తొండంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పరిశీలనకు ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మండల విద్యాకేంద్రాలకు సర్క్యులర్ అందింది. దీని ప్రకారం ఎంఈవో, క్లస్టర్ హెచ్ఎం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆ గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా గల బృందాలు పాఠశాలలను సందర్శించనున్నాయి. గతంలో మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇన్‌పుట్ డేటా షీటు అప్ లోడ్ చేశారు. దీనిని అనుసరించి కమిటీ సభ్యులు అక్కడి అవసరాలను గుర్తించి నివేదికను సమర్పించవలసి ఉంది. క్లాస్ రూమ్ పార్టిషన్, వరండాను క్లాస్ రూంగా మార్చడం, గ్రీన్‌చాక్ బోర్డుల ఇండెంట్, కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఇతర పాఠశాలల్లో మిగులు ఫర్నీచర్ తదితర వస్తువులను అవసరం ఉన్న పాఠశాలలకు సమకూర్చడం తదితర అంశాలు కమిటీ పరిశీలిస్తుంది. మండలంలో ఎంఈవో 1, 2ల ఆధ్వర్యంలో రెండు కమిటీలు పాఠశాలలను పరిశీలించి నివేదిక అందించాలని విద్యాశాఖ ఆదేశించింది.

అరుణాచలేశ్వరునికి విశిష్ట అభిషేకాలు



అభిషేక దృశ్యం

ప్రత్తిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉన్న అపీత కుచాంబ అరుణాచలేశ్వరునికి సోమవారం అభిషేకాలు, విశిష్టపూజలు నిర్వహించారు. పంచామృతాలతో గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో అరుణాచలేశ్వరునికిఅభిషేకాలు చేశారు.

అమలాపురం

చిరుజల్లులు

మలికిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి చిరు జల్లుతో జనం సేద తీరారు. గత వారం రోజుల నుంచి విపరీతమైన ఉష్ణోగ్రతలు పెరగడంతో తల్లడిల్లిపోయిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది.

ఒప్పందం మేరకు జట్టు కార్మికుల రేట్లు పెంచాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైసు మిల్లు జట్టు కార్మికులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైసుమిల్లు జట్టు కార్మికులు

అమలాపురంటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు రైసు మిల్లు జట్టు కార్మికుల రేట్లు పెంచాలని ఐఎఫ్‌టీయూ (రైసుమిల్లు జట్టు కార్మిక సంఘం)జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ పరిధిలోని ద్వారపూడి, ఇప్పనపాడు, మండపేట, ఆలమూరు, యేడిద, గుమ్మిలేరు. కపిలేశ్వరపురం, రావులపాలెం మండలాల్లో ఎన్నో ఏళ్లుగా రైసు మిల్లుల్లో జట్టు కార్మికులుగా పనిచేస్తున్నాం. 2022లో చేసుకున్న ఒప్పందం ఎప్పుడో ముగిసింది. కూలీ రేట్లు పెంచాలని మిల్లు యజమానులను అడుగుతుంటే బయటకు గెంటేస్తున్నారు. బెంగాల్, బీహార్, జార్ఖండ్ వంటి ప్రాంతాల నుంచి వలస కార్మికులను తీసుకువచ్చి తక్కువ రేట్లకు పనిచేయిస్తూ వారికి కనీస సదుపాయాలు కల్పించడం లేదు. యాజమాన్యాలు, కార్మికులతో అధికారులు చర్చలు జరిపి జట్టు కార్మికులకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు 14వ వార్డులోని ఎస్సీ పేటకు గత ఐదేళ్లుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో బొండాయికోడు తూము సెంటర్ నుంచి ఎస్సీ పేటకు కిలోమీటరు మేర పైపులైను వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. కాలక్రమంలో పైపులైను పాతబడిపోవడంతో పగుళ్లు తీసింది. దానికితోడు మంచినీటి కుళాయిలకు ఆక్వా హేచరీల ప్రతినిధులు మోటార్లు ఏర్పాటు చేసి తాగునీటిని మళ్లించేస్తున్నారు. పైపులైన్లు పునరుద్ధరించి వాటరు ట్యాంకు సామర్థ్యాన్ని పెంచి తాగునీటి సౌక ర్యం కల్పించాలని మోకా అమ్ములు, జి.గౌరీ, పి.నవ్య, జి.మంగకుమారి అర్జీ అందించారు.

మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

కె.గంగవరం మండలం దంగేరు గ్రామానికి చెందిన మహిళ అప్పుల పేరిట లక్షలు కాజేసి మోసం చేసిందని ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకుని సొమ్ములు రికవరీ చేసి ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రామచంద్రపురం మండలం హసన్‌బాదకు చెంది గొల్ల వీరవెంకటపల్లపురాజు నుంచి రూ.10లక్షలు తీసుకుని చెక్కులు ఇవ్వగా అవి బౌన్స్ అయ్యాయి. కొన్ని రోజులపాటు తాకట్టుగా ఉంచిన కారును సైతం ఆమె తీసుకువెళ్లిపోయిందని అదేవిధంగా కోడూరు రమాదేవి తదితరుల నుంచి సుమారు రూ.25లక్షలు కాజేసిన సదరు మహిళ తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోగా కేసులు పెట్టిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మించిన మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ బాధితులు కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

లబ్ధిదారులకు ముఖచిత్రం హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి

పి.గన్నవరం, జూలై21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల నుంచి సంక్షేమఫలాలు పొందే లబ్ధిదారులకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ముఖచిత్రం హాజరు నుంచి మినహా యింపు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఐసీడీయస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి అనంతరం మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేసరికి నెట్‌వర్క్ లేకపోవడంతో పలుమార్లు తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకేవైసీని కూడా రద్దుచేయాలని వారు కోరారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని యూడీసీ శ్రీనివాసరావుకు అందజేశారు. నిరసన కార్యక్రమంలో బి.దుర్గ, ఏ.సత్యవేణి, వి.మంగతాయారు, కె.జ్యోతి, సత్యవతి, కె.సునీత, కె.మేరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు, తల్లుల ధర్నా

ముమ్మిడివరం: పౌష్టికాహారం పంపిణీలో కొత్తగా తీసుకువచ్చిన యాప్‌లను రద్దుచేయాలని కోరుతూ అంగన్‌వాడీలు, తల్లులు, పిల్లలతో కలిసి ముమ్మిడివరం సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలంతా తల్లులు, పిల్లలతో సీడీపీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. పౌష్టికాహారం పంపిణీలో ముఖ హాజరు తీసుకోవడం, ఈకేవైసీ వంటివి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి వస్తున్నందున నెట్‌వర్క్ సరిగా లేక అవి అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీవో ఎం.నిహారికకు అందించారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు దుర్గామహేశ్వరి, కార్యదర్శి ఎం.జయలక్ష్మి, సెక్టార్ నాయకులు గాలి మంగమ్మ, డి.రమాదేవి, కె.సత్యవతి, సుబ్బలక్ష్మి, అంజలీదేవి, శైలజ, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన అంగన్‌వాడీలు, తల్లులు పాల్గొన్నారు.

సొసైటీ భవన నిర్మాణానికి నిధులిస్తా

● డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



గోపవరం త్రిమెన్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



రోళ్లపాలెంలో ప్రభాకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, డీసీసీబీ చైర్మన్ రామస్వామి

ఉప్పలగుప్తం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గోపవరం మహాలక్ష్మి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు హామీ ఇచ్చారు. సోమవారం జరిగిన గోపవరం సొసైటీ త్రిసభ్య కమిటీ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్‌పర్సన్‌గా జనసేన నాయకుడు సాకా రాంబాబు, పర్సన్లుగా ఆకుల అప్పారావు, దొమ్మేటి సాయిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, సొసైటీ చైర్మన్లు ఆకేటి పెద్ద, మంచెం బాలకృష్ణ, చిక్కం ఉమేష్, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, మెట్ల రమణబాబు, అరిగెల నానాజీ, కల్వకొలను తాతాజీ, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, ఆకుల సూర్యనారాయణమూర్తి, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, గొలకోటి తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల బుజ్జి, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, చిక్కం సుధాసూర్యమోహన్, ఏవీ కృష్ణారావు, లింగోలు పండు, పైబోడి పండు, నీటిసంఘాల చైర్మన్లు పోలిశెట్టి ఉమ, ఆకుల వెంకటరమణ, బండారు వెంకన్నబాబు, దంగేటి బాబులు, సీఈవోలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీల లక్ష్యం

● అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తున్నాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. రోళ్లపాలెం శ్రీస్వర్ణదుర్గ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘం అధ్యక్షుడిగా సోమవారం మట్ట మహాలక్ష్మి ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా రంకిరెడ్డి మాచరరావు, సైదుల సత్యనారాయణలు బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం శ్రీకళావెంకట్రావు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘం చైర్మన్‌గా అల్లాడ శరత్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్‌తోపాటు డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ మండల, పట్టణశాఖల అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, తిక్కిరెడ్డి నేతాజీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, మాజీ జడ్పీటీసీలు అధికారి జయవెంకటలక్ష్మి, చింతా శంకరమూర్తి, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నల్లా స్వామి, గంధం పల్లంరాజు, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు. సాకుర్రు పీఏసీఎస్ చైర్మన్‌గా నల్లా వెంకటేశ్వరరావు, సభ్యులుగా ముత్తాబత్తుల వెంకటరమణ, చొల్లంగి సాయిబాబు బాధ్యతలు స్వీకరించారు. వీరిని నాయకులు లింగోలు పండు, ములపర్తి సత్యనారాయణ, నూకల సూర్యచంద్రరావు, కొప్పుల నాగమానస తదితరులు అభినందించారు.



కందికుప్ప సొసైటీ త్రిసభ్యకమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

అధ్యక్షుడిగా మూర్తి ప్రమాణ స్వీకారం

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): కందికుప్ప సొసైటీ అధ్యక్షుడిగా నూకల మూర్తి, పర్సన్లుగా కాలాడి వీర్రాజు, బొంతు శివకుమార్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ప్రస్తుతం సంఘం రూ.23కోట్ల వ్యాపారం చేస్తోందని, రూ.4.30కోట్ల డిపాజిట్లు ఉన్నాయని నూతన అధ్యక్షుడు మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ముమ్మిడిరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, ఆకాశం శ్రీనివాస్, నడింపల్లి సుబ్బరాజు, మోకా బాలప్రసాద్, జనసేన నాయకులు నూకల దుర్గబాబు, గుద్దటి జమ్మి, టీడీపీ నాయకులు దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వరరావు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, గుత్తుల సాయి, గొలకోటి వెంకటరెడ్డి, గ్రంధి నానాజీ, మట్టా సూరిబాబు పాల్గొన్నారు.

రైతు సేవలో పీఏసీఎస్‌లు కీలకం

● ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రైతు సేవలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలదే కీలకపాత్ర అని రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నాయని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అయినాపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఇందుకూరి పాండురంగరాజు, డైరెక్టర్లుగా మెండి ఏడుకొండలు, మట్ట తులసీరావులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, దంగేటి శ్రీనివాస్, నడింపల్లి శివరాజు, దూడల స్వామినాయుడు, గోదశి పుండరీష్, చిక్కాల అంజిబాబు, బొంతు నాగరాజు, మట్ట సత్తిబాబు, సబ్బితి డేవిడ్‌రాజు, బొక్కా ధర్మారావు, సానబోయిన శ్రీనివాస్, చిక్కాల బాబులు, సత్తినూకరాజు, అయ్యల రమేష్, బద్రి రమాదేవి, పురుషోత్తం, సర్పంచ్ మోకా రామారావు, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ వైసత్యనారాయణ, సూపర్‌వైజర్ ఎ.రవితేజ, సీఈవో రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



అయినాపురం పీఏసీఎస్ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఇందుకూరి పాండురంగరాజు

'సొసైటీల అభివృద్ధికి పాటుపడాలి'

ఐ.పోలవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): త్రీ మెన్ కమిటీలు సొసైటీల అభివృద్ధికి పాటుపడాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. సోమవారం మురమళ్ల సొసైటీ త్రిమెన్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. చైర్‌పర్సన్‌గా పలివెల త్రినాధరావు, పర్సన్లుగా గోపిశెట్టి వెంకటేశ్వరరావు, పలివెల శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, సర్పంచ్ కాలే రాజబాబు, నడింపల్లి సూర్యవర్మ, గంజా సుధాకర్, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల రాజేష్, దాట్ల రామకృష్ణంరాజు, ఏలూరి మూర్తి, దంతులూరి శ్రీనుబాబు, జంపన బాబు, రాయపురెడ్డి మాణిక్యం, గంజా రమణ, గంజా శ్రీను పాల్గొన్నారు.



మురమళ్ళ త్రిసభ్యకమిటీని అభినందిస్తున్న దృశ్యం



శాకంబరిగా దర్శనమిస్తున్న సిరిపల్లమ్మతల్లి, సమర్పించిన సారె

శాకంబరిగా సిరిపల్లమ్మతల్లి

అయినవిల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): సిరిపల్లి గ్రామదేవత సిరిపల్లమ్మతల్లిని ఆషాడమాసం సందర్భంగా గ్రామ మహిళలు గ్సారెను సమర్పించారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, చలిమిడి, పానకాలను మహిళలు ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ముందుగా సిరిపల్లమ్మ తల్లిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించగా వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారికి ఆషాడం సారె

ముమ్మిడివరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాడలింక గ్రామదేవత రాజ్యలక్ష్మి అమ్మవారికి సోమవారం ఆషాడం సారె సమర్పించారు. గ్రామ ఆడపడుచులు, ముత్తయిదువులు, సమరసత సేవా ఫౌండేషన్‌వారు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చీర, గాజులు, పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లను పురోహితులుఅందించారు.

కృష్ణమాదిగ పర్యటన విజయవంతం చేయాలి

మలికిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న కోనసీమ వస్తున్న పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలని గూడపల్లిలో జరిగిన మాదిగ దండోరా సమావేశం సోమవారం పిలుపునిచ్చింది. గ్రామాల్లో దండోరా జెండా దిమ్మలు లేని గ్రామంలో దిమ్మలు నిర్మించి జెండాలు ఎగురవేయాలన్నారు. సమావేశంలో ముస్కాడి బాలాజీ, ఉల్లంపర్తి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస్



మామిడికుదురు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల రాష్ట్ర సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుంచే శ్రీనివాస్‌ను నియమించినట్టు ఆయన సోమవారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు తనను రాష్ట్ర సంఘ కార్యదర్శిగా నియమించినట్టు ఆయన తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి పదవి కేటాయించిన అధ్యక్షుడికికృతజ్ఞతలు తెలిపారు.

వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడిగా జొన్నలగడ్డ

రాజోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడిగా జొన్నలగడ్డ గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ది రాజోలు వాకర్స్ హెల్త్‌క్లబ్ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యదర్శిగా పామర్తి రమణ, కోశాధికారిగా ఉప్పే నాగేంద్ర, జాలీ వాకర్‌గా మల్లిపూడి పల్లంరాజుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణం చేశారు. గవర్నర్ ఎస్.నాగేశ్వరరావు, జిల్లా వాకర్స్ పీఆర్వో వైఎస్ఎన్ మూర్తి, విశ్రాంత ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ, సామాజిక సేవాకార్యకర్త బోనం రాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

అంబాజీపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మాచవరం శివారు నక్కలపుంతలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ తాటాకిలు దగ్ధం కాగా రూ.50వేలు ఆస్తినష్టం సంభవించింది. ముత్తాబత్తుల అర్జునరావుకు చెందిన తాటికింట్లో ఆదివారంరాత్రి వీచిన గాలులకు విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పురవ్వలు చెలరేగాయి. దీంతో తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో పలు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలను అదుపుచేశారు.

బెల్టు షాపులపై దాడులు

మామిడికుదురు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'అందుబాటులో మద్యం.. విచ్చలవిడిగా బెల్టుషాపులు' కథనానికి రాజోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు స్పందించి బెల్టుషాపులపై దాడులు చేశారు. మండలంలో పెదపట్నం, గోగన్నమఠం గ్రామాల్లో ఈ దాడులుచేసి ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఇనస్పెక్టర్ కె.వీరబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సీహెచ్ స్వామిరెడ్డి, హెచ్‌సీ జేఏఎస్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం బెల్టు షాపులపై దాడులు నిర్వహించామని రాజోలు సీఐ కె.వీరబాబు తెలిపారు. విలేఖరులతో సీఐ మాట్లాడుతూ పెదపట్నం, గోగన్నమఠంలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రూ.5 లక్షల సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

ముమ్మిడివరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో అంగవైకల్యం బారిన పడిన ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన గొలకోటి నాగేశ్వరరావుకు సీఎం సహాయనిధి నుంచి రూ.5లక్షలు మంజూరైంది. ఈ చెక్కును లబ్ధిదారునికి సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నాగేశ్వరరావుకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, కాకర్లపూడి రాజేష్, దాట్ల పృథ్విరాజ్, యాళ్ల ఉదయ్, గొలకోటి భాస్కరరామమూర్తి, గొలకోటి తాతాజీ, నగుబత్తుల ఫణి, చిట్టిబాబు, శివలతో పాటు పలువురు ఉన్నారు.

ఇమామ్ జైనుల్ అబేదిన్‌కు ముస్లింల ఘన నివాళి

మామిడికుదురు, జూలై 21(ఆంధ్రజ్యోతి): హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు, నాల్గవ ఇమామ్ జైనుల్ అబేదిన్ వర్ధంతి సందర్భంగా ముస్లింలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగరం, మామిడికుదురు, మొగలికుదురు గ్రామాల్లో ప్రత్యేక మజ్లిస్‌లు జరిగాయి. ఇమామ్ హుస్సేన్ పంజాలో అబ్రార్ హుస్సేన్ కుటుంబ సభ్యులు ఇమామ్‌అలీరజా పంజాలో అక్బర్ అలీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మజ్లిస్‌లు జరిగాయి. మొగలికుదురులోని పెదపంజీషాలో మజ్లిస్ జరిగింది. అనంతరం పంజా నుంచి గుమ్మటాన్నితీసి గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. పంజా నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

రాజోలు రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

రాజోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాజోలు రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయమని రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుహాసిని అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలకు కాకినాడకు చెందిన జి.సత్యనారాయణ ఆర్థిక సహాయంతో వారి కుమార్తె సంధ్యానాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని రూ.12వేలు విలువచేసే రెండు మైక్రోస్కోప్‌లు, వెయింగ్ మిషన్‌లను సోమవారం రాజోలు రోటరీక్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి ఆంజనేయులు హెచ్‌ఎం సుహాసినికి అందజేశారు. అలాగే ఆకెళ్ల రమణ, శ్రీలక్ష్మిలు నేటి తరాన్ని ప్లాస్టిక్ బారి నుంచి రక్షించడానికి పది మంచినీటి కుండలను విద్యార్థులకు అందజేశారని హెచ్‌ఎం సుహాసిని తెలిపారు. ఈ విధంగా బహూకరించిన రాజోలు రోటరీక్లబ్, రమణ, శ్రీలక్ష్మిలకు ఆమె ఎస్ఎంసీ చైర్మన్, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దార్ల పెదబాబు, చిట్టినీడి లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండితులకు ఘన సన్మానం

రాజోలు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాజోలు తాలూకా వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో 28వ రాజోలు తాలూకా స్మార్త, ఆగమ, అపర పండిత సన్మాన సభ రాజోలు శివాలయం ప్రాంగణంలో కొంపెల్ల సత్యవతమ్మ మహన్యాస మండపంపై నూతనంగా నిర్మించిన కీర్తిశేషులు డాక్టర్ పొన్నాడ హనుమంతరావు, డాక్టర్ ఆమంచి వెంకట అప్పారావు ఆధ్యాత్మిక మండపంలో కడియా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సన్మానసభకు ముఖ్యఅతిథిగా భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థాన వేదపండితులు వెంకటరామచంద్ర సోమయాజులు పాల్గొన్నారు. 150మంది పండితులకు ఘన సన్మానంచేసి నూతన వస్త్రాలతోపాటు పారితోషకం అందజేశామని శ్రీగౌతమీ పుష్కర వేద పాఠశాల అధ్యక్షుడు పొన్నాడ సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి సోమేశ్వరప్రసాద్ తెలిపారు. వాడపల్లి శ్రీనివాసాచార్యులు, యలమంచిలి వీరభద్రశాస్త్రి, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అనుమతిలేని కట్టడాల క్రమబద్ధీకరణ

యానాం, జూలై 21(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గ పరిధిలో అనుమతిలేకుండా ప్లాన్ ఉల్లంఘించి నిర్మించిన వివిధ రకాల కట్టడాలకు ఏకకాల క్రమబద్ధీకరణ పథకం(ఒన్‌టైమ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ప్రవేశపెడుతూ పుదుచ్చేరి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నివాస గృహలకు రూ.5వేలు, ఇతర భవనాలకు రూ.10వేలు దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. నివాస భవనాల పరిశీలనకు చదరపు మీటరుకు రూ.20, ఇతర భవనాలకు రూ.50 చెల్లించాలని పేర్కొన్నారు.

రేపు పుదుచ్చేరి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశ ఎంపికలు

యానాం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎస్‌డీఏపీ స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ లో వివిధ క్రీడా విభాగాలలో ఆరు, ఏడు తరగతుల విద్యార్థుల ప్రవేశానికి ఎంపికలు జరుగనున్నాయి. 23వ తేదీ బుధవారం యానాం వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 8.30 నుంచి నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశంకర్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు యానాంలో నిర్వహించే ఎంపిక పోటీలలో పాల్గొనేందుకు రావాలని కోరారు.

జిల్లాలో 26 పీఎంశ్రీ పాఠశాలలు

● 39 యాక్టివిటీస్ అమలుకు చర్యలు

ఐ.పోలవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకానికి జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో 39 యాక్టివిటీస్ అమలు చేస్తున్నట్టు జిల్లా కమిటీ తెలిపింది. పీఎంశ్రీ పథకంలో జిల్లాలో 26 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో రాయవరం, ఐ.పోలవరం, పి.గన్నవరం పాఠశాలలను బెస్టాఫ్ త్రి పాఠశాలలుగా ఎంపిక చేశారు. జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్‌వీ సోమిరెడ్డి, సీహెచ్ ఆంజనేయులు, సైట్ ఇంజనీర్ సూర్యనారాయణ సోమవారం ఐ.పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పథకంలో అమలవుతున్న కార్యక్రమాలను ఏఎంవో రాంబాబు నేతృత్వంలో జిల్లా కమిటీ పరిశీలించింది. పీఎంశ్రీ పథకం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు వివరించారు. ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ ఈ పథకంలో జిల్లాలో మొదటి ఫేజ్‌లో మ21, రెండవ ఫేజ్‌లో 6 పాఠశాలలు ఎంపికైనట్టు తెలిపారు. ఈ పాఠశాలల్లో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్స్, ఆట స్థలాల అభివృద్ధి, కిచెన్ గార్డెన్ ఫెన్సింగ్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, స్కౌట్ అండ్ గైడ్, ర్యాంప్ విత్ రైలింగ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నట్టు తెలిపారు. స్టేట్ టీమ్, నేషనల్ టీమ్స్ త్వరలో ఎంపికైన పాఠశాలలను సందర్శిస్తాయన్నారు.

పీఎంశ్రీ పాఠశాలను పరిశీలించిన కమిటీ సభ్యులు

పి.గన్నవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.1.17 కోట్లు నిధులు విడుదలైనట్టు సమగ్ర శిక్షా అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. పి.గన్నవరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీఎంశ్రీ పథకం కింద అమలవుతున్న కార్యక్రమాలను ఎఎంవో నేతృత్వంలో జిల్లా కమిటీ సోమవారం పరిశీలించింది. పీఎంశ్రీ పథకం ద్వారా అమలవుతున్న 39 యాక్టివిటిస్ ఏ విధంగా అమలువుతున్నాయనే అంశాన్ని జిల్లా టీమ్ పరిశీలించింది. పాఠశాల హెచ్‌ఎం కోసూరి ఉమాదేవి పీఎంశ్రీ పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను జిల్లా కమిటీకి వివరించారు.

బాలయోగీశ్వరులను దర్శించుకున్న పవన్‌కుమార్

ముమ్మిడివరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని భగవాన్ శ్రీబాలయోగీశ్వరులను బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. తపో ఆశ్రమంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దు

అమలాపురం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును వైసీపీ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్ ఖండించారు. జనుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దు భారత రాజ్యాంగం ముద్దు అంటూ నినాదాలు చేశారు.

చెయ్యేరులో సుపరిపాలనలో తొలి అడుగు



చెయ్యేరులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ రాజశేఖర్

కాట్రేనికోన, జూలై 21(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా డోర్ టూ డోర్ కార్యక్రమంలో చెయ్యేరు తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలను కలిసి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

దేవాలయాల అభివృద్ధికి రూ.5.60 కోట్లు మంజూరు

ఐ.పోలవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పలు దేవాలయాల అభివృద్ధికి రూ.5.60 కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయాన్ని రూ. 4కోట్లతో ఆధునికీకరించనున్నట్టు ఆయన వివరించారు. ఠాణేలంక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కోటి రూపాయలు, ఇంజరంలో పరదేశమ్మ ఆలయ ఆధునికీకరణకు రూ.60లక్షలుమంజూరయ్యాయన్నారు.

ఆధ్యాత్మిక, హిందూ ధర్మప్రచారం

అంతర్వేది, జూలై 21(ఆంధ్రజ్యోతి): త్రేత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రేత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక మామిడికుదురు కమిటీ ఆధ్వర్యంలో సఖినేటిపల్లి రామేశ్వరం గ్రామంలో సోమవారం ఆధ్యాత్మిక, హిందూ ధర్మప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవని పూర్వీకులు తెలిపారన్నారు. జ్ఞానవేదిక అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, హనుమంతరావు, బ్రహ్మాజీ, సుబ్బారావు, అన్నపూర్ణ, జగదీష్, సత్యవతి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్

అమలాపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మలికిపురం మండల దిండి గ్రామానికి చెందిన దేవ రాజేంద్రప్రసాద్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ రెండో జిల్లా మహాసభల్లో భాగంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధుల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టునేపథ్య కుటుంబం నుంచి తాను వచ్చానన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేష్ ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థి ఆనంద్ మృతికి సంతాపం



సత్య ఆనంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైతన్యరాజు

అమలాపురంరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తిచేసి గీతం వైద్య కళాశాలలో అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్న పూర్వ విద్యార్థి డాక్టర్ పోసూరి సత్యఆనంద్ గుండుపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆనంద్ మృతికి సంతాపం తెలుపుతూ సోమవారం కిమ్స్‌లో సంతాప సభ నిర్వహించారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆనంద్ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు డాక్టర్ పి.సుబ్బారావు, డాక్టర్ ప్రవీణ్ మస్కే, డైరెక్టర్ కృష్ణంరాజు, సీఏవో రఘు పాల్గొన్నారు.

చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వ పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు సాహిత్యం ఉధృతంగా ఉన్న రోజుల్లో చోడగిరి చంద్రరావు అంబేడ్కర్ ఆశయాలను తన పద్యాల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని త్రిరత్న బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు, మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. భీమకవి చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వ పుస్తకాన్ని అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో జరిగిన కార్యక్రమంలో సూర్యారావు ఆవిష్కరించారు. పుస్తక సంపాదకుడైన డాక్టర్ కోయ కోటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రరావు రాసిన భీమ శతకం వేమన శతకం వంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బండి సత్యనారాయణ, ప్రచురణకర్త నేలపూడి బాలరాజు, డీబీ లోక్, జంగా బాబూరావు, డాక్టర్ ఎంఏకే భీమారావు, నాగాబత్తుల ప్రసాదరావు, బీవీవీ సత్యనారాయణ, ఇసుకపట్ల రఘుబాబు, కోట రామ్మోహనరావు, పెనుమాల చిట్టిబాబు, రేవు తిరుపతిరావు, కాశి వెంకట్రావు, ఐఎస్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆక్సిజన్ ప్లాంటును పునరుద్ధరించాలి'

అమలాపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు ప్రోత్సాహంతో మిత్రుడైన క్రియేటివ్ డైరెక్టర్ బండ్రెడ్డి సుకుమార్ ఎంతో ఉదారతతో రూ.40లక్షలు విరాళంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి ఆక్సిజన్ ప్లాంటును అందించారు. 2021 మేలో ఆక్సిజన్ ప్లాంటును ప్రారంభించి ఎందరో కొవిడ్ బాధితులకు ఆక్సిజన్ ప్లాంటు ద్వారా ప్రాణదానం చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాలి నుంచి ఆక్సిజన్‌ను తీసే ఆ ప్లాంటు అధికారుల నిర్లక్ష్యంతో పనికి రాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. దాంతో డైరెక్టర్ సుకుమార్ బావ అయిన బ్రహ్మాజీ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారిని కలిసి ఆక్సిజన్ ప్లాంటును పునరుద్ధరించే విధంగాచర్యలు తీసుకోవాలని రాతపూర్వకంగా అర్జీ అందించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



రామచంద్రపురం మండలం కాపవరంలో కరపత్రం అందజేస్తున్న మంత్రి సుభాష్



మండపేటలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

ప్రజల సంక్షేమానికి ప్రాధానం

సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల

ద్రాక్షారామ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సంక్షేమం అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి రామచంద్రపురం మండలం కాపవరంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటి పర్యటన జరిపారు. కాపవరంలో ఇంటింటి పర్యటన జరిపి ప్రభుత్వపాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల అభిప్రాయాలు నమోదు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఎంతో చేశాం

మండపేట, (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని 22వ వార్డులో సోమవారం ఆయన స్థానిక నేతలతో కలిసి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపారు. వారి సమస్యలను ఆయన తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు ఇన్‌చార్జి ఆరి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ బి.సరస్వతి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు, చిలుకూరి బాపిరాజు, సుర్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు తావు లేకుండా రైతులకు సేవలందించాలి

త్రిసభ్య కమిటీకి ఎమ్మెల్యే వేగుళ్ల హితవు

రాయవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు తావు లేకుండా రైతులందరికీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ సేవలందించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం పసలపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా సత్తి వెంకట కృష్ణారెడ్డి(ఎస్‌వీ), సభ్యులుగా బుంగా పెద్ద, అనుసూరి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను త్రిసభ్య కమిటీ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. త్రిసభ్య కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్‌కె పరమహంస, సహకార సంఘం సీఈవో ఎస్.రాజారెడ్డి, అనసూరి గోవిందరాజులు, మల్లిడి అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పసలపూడి సొసైటీ పాలకవర్గ త్రిసభ్య కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పీ4 సర్వేను వేగవంతం చేయండి

కె.గంగవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పీ4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసు అన్నారు. సోమవారం ఆయన యండగండి, పామర్రు గ్రామాల్లో పర్యటించారు. పీ4 సర్వేలో భాగంగా మార్గ దర్శకులు, బంగారు కుటుంబాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తించి నిర్దేశిత సమయంలోగా కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. పామర్రులో రక్షిత మంచినీటి ట్యాంకుకు మెట్లు లేకపోవడం వలన కలుగుతున్న ఇబ్బందులు గురించి కార్యదర్శి సీతా రామయ్య ఎంపీడీవోకు వివరించారు. దీనితో ఆయన ట్యాంకును పరిశీలించారు. సమస్యను గురించిన ఎంపీడీవో ఎస్. శ్రీనివాసు మెట్లు ఏర్పాటు చేయడానికి స్థానిక మంత్రితో పాటు, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మండపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని ద్వారపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు పిలుపునిచ్చారు. ప్రజలు చేతిసంచీల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని కోరుతూ సోమవారం పాఠశాలలో ప్లాస్టిక్ కవర్లు వద్దు చేతి సంచులే ముద్దు అంటూ నినాదాలు చేశారు. పాఠశాలలో వున్న 150 మంది విద్యార్థినులు 300 చేతిసంచులు తయారు చేసి ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ చేతి సంచీలను వాడాలని విద్యా కమిటీ ఛైర్మన్ మురళీకృష్ణ అన్నారు. సంచులను తయారు చేసి ఆదర్శంగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.48 లక్షలు



వెంకన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న సినీనటి శ్రీదేవి

ఆత్రేయపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,48,116 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన కుదప శ్రీ వెంకట ప్రత్యూష్న రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు. కోర్టు సినిమా నటి శ్రీదేవి కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అధికార యంత్రాంగంపై మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అన్నపూర్ణ

ఆత్రేయపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ సంస్థలపై అధికారులపై మండిపడ్డారు. రైతుల ధాన్యం బకాయిలు వారి ఖాతాల్లో జమ కాలేదని అప్పులు చేసి పంట పండించారని జడ్పీటీసీ బోనం సాయిబాబా సభ దృష్టికి తీసుకువచ్చారు. జలజీవన్ మిషన్ ద్వారా పనులు పూర్తి చేసినా తాగునీరు అందించడం లేదంటూ వెలిచేరు సర్పంచ్ వేముల శ్రీనివాస్ సభలో ధ్వజమెత్తారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు తమ దృష్టికి తీసుకురావడం లేదంటూ, పనుల వివరాలు తమకు తెలియచేస్తేనే పనులకు తీర్మానాలు ఆమోదిస్తామని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెస్టాఫ్ త్రీ పాఠశాలను తనిఖీ చేసిన డిస్ట్రిక్ట్ కమిటీ బృందం



రాయవరం హైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు

రాయవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం డిస్ట్రిక్ట్ కమిటీ బృందం పరిశీలించింది. పీఎంశ్రీ పథకంలో భాగంగా పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను జిల్లా కమిటీ బృందం తనిఖీ చేశారు. పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలో అమలవుతున్న 39 యాక్టివిటీస్ అమలు తీరును పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం వి.శాంతి సునిత పీఎంశ్రీ ప్రోగ్రాం కింద అమలవుతున్న కార్యక్రమాలను డిస్ట్రిక్ట్ కమిటీకి వివరించారు. ఈసందర్భంగా సమగ్రశిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు మాట్లాడారు. జిల్లాలో ఉన్న 26 పాఠశాలల్లో రాయవరం, ఐ.పోలవరం, పి.గన్నవరం పాఠశాలలను బెస్ట్ ఆఫ్ త్రీ పాఠశాలలుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. డిస్ట్రిక్ట్ కమిటీలో ఎంఈవోలు సీహెచ్‌వీ సోమిరెడ్డి, సీహెచ్ ఆంజనేయులు, సైట్ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ సిబ్బంది అలసత్వంపై ఫిర్యాదు

కె.గంగవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పామర్రు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బందిపై గ్రామానికి చెందిన వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సబ్‌స్టేషన్‌లో పనిచేసే షిఫ్ట ఆపరేటర్స్, లైన్ ఇన్‌స్పెక్టర్ వినియోగదారులపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు మరివాడ సూరిబాబు ఆధ్వర్యంలో వినియోగదారులు రామచంద్రపురం డీఈ రత్నాలరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన్ను వివరణ కోరగా మండపేట డీఈ శ్రీధర్‌ను విచారణ అధికారిగా నియమించి విచారణకు ఆదేశించామన్నారు.



రావులపాలెం మండలంలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

కుండపోత వర్షం

రావులపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి నుంచి కుండపోతగా వర్షం కురవడంతో పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షం కారణంగా కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు నీటమునిగాయి. మురుగు డ్రైన్లు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. పుంత రోడ్లు బురదగా మారి రైతుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

వైసీపీ నాయకుల నేరాలకు శిక్షలు తప్పవు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నాయకులు చేసిన అవినీతి, నేరాలకు శిక్షలు అనుభవించక తప్పదని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ అన్నారు. ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. మద్యం కుంభకోణంలో పాత్రదారులు ఎంతటివారైనా అరెస్టులు జరుగుతాయన్నారు.

అంగన్‌వాడీ లబ్ధిదారుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ లబ్ధిదారులు సోమవారం రామచంద్రపురం సీడీపీవో కార్యాలయం ముందు ధర్నా జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గమ్మ మాట్లాడారు. అనంతరం సీడీపీవోకు లబ్ధిదారులు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మందపల్లి పార్వతి అమ్మవారిని శాకంబరిగా అలంకరించిన దృశ్యం

శాకంబరిగా పార్వతీ అమ్మవారు

కొత్తపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాడ బహుళ ఏకాదశి సోమవారాన్ని పురస్కరించుకుని పార్వతీ అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరించారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో పార్వతి అమ్మవారికి ఆషాడం సారెను పంపించగా మందపల్లి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, గ్రామపెద్దలు మంగళవాయిద్యాలతో ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనరు డీఎల్‌వీ రమేష్ బాబు, ఆలయ సహాయ కమిషనరు దారపు రెడ్డి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అశిరాంబ అమ్మవారి తీర్థం

కపిలేశ్వరపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న అశిరాంబ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం అమ్మవారి తీర్థం జరిగింది. గ్రామ ఆడపడుచులతో పాటు అంగర, పడమరఖండ్రిక గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం

కపిలేశ్వరపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): టేకి గ్రామంలోనున్న వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివారి చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, లఘుఅర్చన, విశేష నివేదన, నవనీత హారతి, బాలభోగ వితరణ, హోమాలు తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో, బ్రహ్మోత్సవ కమిటీ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల భక్తులు, మహిళలు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రావులపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధన్యత ఇస్తు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దేవరపల్లిలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి కిట్లు, యూనిఫాంలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. కార్యక్రమంలో మట్టపర్తి మణికంఠ, కేతా శ్రీను, గుబ్బల రమణ, యార్లగడ్డ మమ్ము, ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన బ్యాగ్ అప్పగింత

రావులపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఊబలంక నుంచి రావులపాలెం వస్తున్న గుడిమెట్ల మధులత ఆటో దిగే సమయంలో ఆటోలో బ్యాగును మర్చిపోయారు. ఆటో డ్రైవర్ మహ్మద్ వల్లీ బ్యాగును గుర్తించి పోలీసులకు అప్పగించారు. బ్యాగు పోగొట్టుకున్న మహిళ పోలీస్‌స్టేషన్‌కు రాగా పోలీసులు ఆమెకు దాన్ని అప్పగించారు.

చినుకుపడితే...చిత్తడే

• అధ్వానంగా మారిన కడియం-వెదురుమూడి రోడ్డు • చోద్యం చేస్తున్న పాలకులు • ప్రజలకు తప్పని పాట్లు



బురదగా మారిన నర్సిపూడి వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు

ఆలమూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఈ రోడ్డుపై చినుకుపడితే చాలు రోడ్డంతా చిత్తడిగా మారి స్థానికులకు నరకాన్ని తలపిస్తోంది. కడియం-వెదురుమూడి రోడ్డులోని ఆలమూరు మండలం నర్సిపూడి వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి ఇది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డుపై గుంతలు పూడ్చేస్తామని చాలా రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. కడియం-వెదురుమూడిలో కడియం నుంచి దుళ్ల వరకు రోడ్డును, పెనికేరు నుంచి వెదురుమూడి వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ మధ్యలో ఉన్న నర్సిపూడి నుంచి పెనికేరు వరకు రోడ్డును వదిలేశారు. ఈ రోడ్డుకు మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో టెండర్ కూడా ఖరారైంది. వీటి పనులు చేయడంలో ఆలస్యం కావడంతో ఈలోపు నర్సిపూడి నుంచి వెదురుమూడి రోడ్డు అభివృద్ధికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక గ్రాంటును తీసుకొచ్చారు. దీంతో మరమ్మతులను నిలిపివేశారు. కొత్తగా మంజూరైన రోడ్డుకు టెండర్లు పిలిచి రోడ్డు మొదలు పెట్టడం ఇప్పట్లో జరిగే పనిలా కనిపించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణమంటే ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ముఖ్యంగా నర్సిపూడి గ్రామ పరిధిలో మరింత అధ్వానంగా మారడంతో గ్రామస్తులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. నర్సిపూడి ప్రజల ఇబ్బందులను గుర్తించి మరమ్మతులు అయినా చేయాలని బీజేపీ మండల నాయకుడు వడ్డి దొరయ్యనాయుడు అధికారులను కోరారు.



మారేడుబాకలో జరిగిన రైతు సదస్సులో మాట్లాడుతున్న వనరుల కేంద్రం జిల్లా అధికారి

ఖరీఫ్‌లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన

మండపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మారేడుబాకలో రైతులకు ఖరీఫ్ సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ సారధ్యంలో దీన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వాడే ఎరువుల విధానం వివరించారు. ఏరువాక కేంద్రం నుంచి వచ్చిన డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాధాన్యత తెలిపారు. రైతులు కొర్రలు జొన్నలు, రాగులు వంటి వాటిని పండించాలని సూచించారు. వ్యవసాయ అధికారి జెఎస్‌వీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నూతన పరిజ్ఞానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ మండల అధికారి కె.ప్రభాకర్ మాట్లాడుతూ అన్నదాతా సుఖీభవ సాయం పథకం జాబితా సిద్ధమైందన్నారు. జాబితాలో పేరులేని రైతులు ఉంటే తమ పేర్లను సమీపంలో వున్న వ్యవసాయ శాఖ సహాయకుల వద్ద ఈనెల 23లోపు నమోదు చేయించుకోవాలని కోరారు. పంటల బీమాను వచ్చేనెల 15కల్లా చేయించు కోవాలని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోవిందరాజు, పి.శ్రీనివాస్. సాగునీటి సంఘ ఉపాధ్యక్షుడు ముత్యాల అన్నవరం, రాయుడు గంగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోటిపల్లి-ముక్తేశ్వరం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం

మీట్ ది ప్రెస్‌లో మంత్రి సుభాష్



మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి రాజీలేని కృషి చేస్తానని మంత్రి సుభాష్ తెలిపారు. సోమవారం రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో మంత్రి మాట్లాడారు. కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య బ్రిడ్జి నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంటు సమావేశాల నాటికి సీఎం చంద్రబాబు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రెండు జాతీయ రహదారులను కలుపుతూ జొన్నాడ నుంచి యానాం ఏటిగట్టు రహదారి అభివృద్ధికి పుష్కరాల గ్రాంటు ద్వారా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఏటిగట్టు రహదారి అభివృద్ధితో గోదావరి తీరప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో హృద్రోగులకు చికిత్సలు అందించేందుకు ప్రత్యేక ఆసుపత్రి నిర్మాణానికి సంకల్పించామన్నారు. ఇప్పటికే ఒక దాత స్థలం సమకూర్చారని ఆసుపత్రి నిర్మాణానికి, ప్రత్యేక వసతులు, ఆధునికి వైద్య పరికరాలు సమకూర్చేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. రామచంద్రపురంలో ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆగస్టు తరువాత జర్నలిస్టులకు అక్రిడేషన్ల జారీ, తదుపరి నివేశన స్థలాలు సమకూర్చడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీపై ఉత్తర్వులు అమలు జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్ రాయ్, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



వెలిచేరులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సోమవారం వెలిచేరు సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో ఆయన మాట్లాడారు. తొలుత సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఏడాది పాలనలో చేపట్టిన ప్రగతిని వివరించారు. అనంతరం వెలిచేరు సొసైటీ అధ్యక్షుడిగా నాగిరెడ్డి సత్యనారాయణ, సభ్యులుగా దూళ్లిపాళ్ల కామేశ్వరశాస్త్రి, మిద్దే వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. వేరొక కార్యక్రమంలో వసంతవాడ సొసైటీ అధ్యక్షుడిగా దండు సీతారామరాజు, సభ్యులుగా కరుటూరి రామ్మోహనరావు, కాయల గంగాచలం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, పాలూరి సత్యానందం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కపల సత్తిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెత్సా అనిల్, రజని, సుబ్బలక్ష్మి, పి.నాగేంద్ర, నాగిరెడ్డి, సురేష్, మిద్దే శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాకతిప్పలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వాకతిప్పలో ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో రాంబాబు రెడ్డి

కపిలేశ్వరపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్పలో కేశవ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, పీఏసీఎస్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో ఎం.రాంబాబు రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా గొడవర్తి వెంకటలక్ష్మి, మెంబర్లుగా 9 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వాకతిప్ప పీఏసీఎస్ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా గొడవర్తి సత్యనారాయణమూర్తి, మెంబర్లుగా వాసంశెట్టి నాగేశ్వరరావు, దాకారపు నాగేశ్వరరావులతో సొసైటీ కార్యదర్శి కరుటూరి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గుడాల జయబాబు, బలవరెడ్డి సత్తి బాబు, అల్లూరి రామకృష్ణ చౌదరి, నేమాని వెంకటేశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ కుంచె ప్రసన్నకుమార్, నెక్కంటి శ్రీరాంజీ, గొడవర్తి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి రూ.2.28 కోట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి మంజూరైనట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కార్యాలయం నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు వచ్చాయన్నారు. కొత్తపేట మండలం వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారి ఆలయాభివృద్ధికి రూ.28 లక్షలు, రావులపాలెం మండలం గోపాలపురంలోని బాలేశ్వరస్వామి ఆలయానికి రూ.1.25 కోట్లు, వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.75 లక్షలు దేవదాయ శాఖ నుంచి విడుదలయ్యాయని ఆయన తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

మండపేట, జూలై, 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ విభాగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణలకు రుణపడి ఉంటామని కార్మికులన్నారు. తమ సమస్యలను పరిష్కరించి వేతనాలు పెంచిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు పాలపర్తి సుబ్బరాజు, టేకి వెంకన్న, అశోక్, లీలాకృష్ణ, సంతోష్ కూమార్, కప్పల అన్నవరం, కప్పల సురేంద్ర, తాతారావు, వాసు, ప్రసాద్, రమేష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సారధులు బాధ్యతలు స్వీకరణ

ఆలమూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు సహకార సంఘాల పాలక వర్గాలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చింతలూరు, పెనికేరు, మోదుకూరు సహకార ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పాలక వర్గాలు ప్రమాణ స్వీకారం చేశారు. చింతలూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా నల్లా వెంకటేశ్వరరావు, సభ్యులుగా బుంగ చిన్నబ్బులు, కడలి రమేష్, పెనికేరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మేకా రామన్న, సభ్యులు వాసంశెట్టి వెంకటరమణ, సలాది గోవిందరాజు, మోదుకూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఈదల వీర్రాజు, సభ్యులు కొత్తగళ్ల గోపికృష్ణ, తాతపూడి చినజానికయ్య బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గాలను కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌తోపాటు పలువురు కూటమి నాయకులు అభినందించారు.



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఫేస్‌యాప్ రద్దు చేయాలంటూ ధర్నా

కపిలేశ్వరపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఫేస్ యాప్ రద్దు చేయాలంటూ అంగన్‌వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని ధర్నా చేశామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

రావులపాలెం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దేవరపల్లిలో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకాలకు భూమిపూజ చేశారు. దేవరపల్లి శివారు బాలయోగి పేట, లేఅవుట్ -1, దంగేటివారిపాలెం ప్రాంతాల్లో నిర్మించనున్న వాటర్ ట్యాంకులకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి నిధులు మంజూరు..: కొత్తపేట నియోజకవర్గంలో పలు ఆలయాల అభివృద్ధికి రూ.2.28 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఆనం కార్యాలయం నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు వచ్చాయని ఆయన తెలిపారు.